మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి..

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Circulated to Telangana
Published from Jagitial

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 4-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 36 Issue: 36

04 ఆగస్టు 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:59 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి షష్ఠి రా. 9:59 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం రేవతి రా. 9:54 వరకు తరువాత అశ్విని యోగం ధృతి రా. 7:26 వరకు కరణం గరజి ఉ. 10:30 వరకు వనిజ రా. 9:59 వరకు వర్జ్యం ఉ. 9:57 నుండి ఉ. 11:33 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:24 వరకు రా. 11:14 నుండి రా. 11:59 వరకు రాహుకాలం మ. 3:33 నుండి సా. 5:08 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు గుళికాకాలం మ. 12:22 నుండి మ. 1:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:23 నుండి తె. 5:11 వరకు అమృత ఘడియలు రా. 7:29 నుండి రా. 9:04 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# భారత్‌లో 'కామన్వెల్త్ 2030'

**దేశానికి చేరిన కామన్వెల్త్ పతాకం.. 2030లో అహ్మదాబాద్‌లో వందేళ్ల వేడుకలు**

**'వసుధైక కుటుంబకం' సందేశం ప్రత్యేక ఆకర్షణ**

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకల్లో తదుపరి క్రీడలకు ఆతిథ్యమివ్వనున్న భారత్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. కామన్వెల్త్ క్రీడల పతాకాన్ని భారత ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష అందుకున్నారు.

అహ్మదాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): 2030లో గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఈ క్రీడలు.. కామన్వెల్త్ చరిత్రలో శతాబ్ది (100వ) క్రీడలు కావడం విశేషం. గ్లాస్గోలోని ఓవో హైడ్రో ఎరీనాలో జరిగిన ఈ కార్యక్రమంలో కామన్వెల్త్ స్పోర్ట్ అధ్యక్షుడు డాక్టర్ డొనాల్డ్ రుకారే సమక్షంలో పతాక మార్పిడి జరిగింది. ముందుగా కామన్వెల్త్ -2 వ పేజీలో...

# భాగ్యనగరంలో బ్రిక్స్

**నేడు, రేపు అవినీతి నిరోధక బృందం రెండో సమావేశం**

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): బ్రిక్స్ దేశాల మధ్య అవినీతి నిరోధక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విదేశాలకు తరలించిన అక్రమ ఆస్తుల రికవరీకి సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా -2 వ పేజీలో...

BRICS INDIA 2026



# ఎల్ నినో.. కాదు కుంభవృష్టి!

**అగ్నిప్రమాదాలు, ప్రాణనష్టం తప్పవు**

**ఆర్నెల్లలో విగ్రహ ప్రతిష్ఠ చేయాల్సిందే**

**లష్కర్ బోనాల్లో 'రంగం' భవిష్యవాణి**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో లష్కర్ బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం 'రంగం' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మాతంగి స్వర్ణలత పచ్చి మట్టికుండపై నిలబడి అమ్మవారి తరఫున భవిష్యవాణి వినిపించారు.

సికింద్రాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): ఈ ఏడాది తాను తీవ్ర ఆగ్రహంతో ఉన్నానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నానని అమ్మవారు తన వాణిలో హెచ్చరించారు. ప్రజల -2 వ పేజీలో...

# కమలాన్ని పీకేశాడు!

**బంకీపూర్‌లో 19,324 ఓట్ల ఆధిక్యంతో ప్రశాంత్ కిశోర్ గెలుపు.. బీజేపీ కంచుకోటకు పగుళ్లు**



రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

పాట్నా/బంకీపూర్: సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్లు ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం గమనార్హం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ తరువాయి 2 వ పేజీలో...



# 1000 రోబోటిక్ సర్జరీలు

**మూడేళ్లలోనే నిమ్స్ అరుదైన ఘనత.. ప్రభుత్వ దవాఖానల్లో సరికొత్త రికార్డు**

**90 శాతం సర్జరీలు ఉచితంగానే.. వైద్యులకు రేవంత్, దామోదర అభినందనలు**

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది.

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 1000 శస్త్రచికిత్సలలో తరువాయి 2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,422 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,038 |

# పెగ్గులో ఫ్లేవర్ ఫ్రాడ్!

**రమ్, విస్కీలలో కృత్రిమ రుచులు**

**దిగ్గజ బ్రాండ్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ సీరియస్**

**కృత్రిమ ఫ్లేవర్లు కలుపుతున్నారని ఆరోపణలు**

**లేబుళ్లపై తప్పుడు వయసు వివరాలు**

**పలుచోట్ల నిషేధం, కంపెనీలకు నోటీసులు**



దేశంలోని పలు ప్రముఖ మద్యం బ్రాండ్లపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కొరడా ఝుళిపించింది. ఓల్డ్ మాంక్, మెక్‌డొవెల్స్ నం.1, బ్యాగ్‌పైపర్, రాయల్ చాలెంజ్, యాంటిక్విటీ బ్లూ వంటి దిగ్గజ బ్రాండ్లను ఉత్పత్తి చేస్తున్న కంపెనీలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించింది. లేబుళ్లపై తప్పుడు సమాచారం ఇవ్వడం, కృత్రిమ ఫ్లేవర్లను వాడటం, మద్యం నిల్వ కాలంపై తప్పుడు ప్రకటనలు చేయడం వంటి కారణాలతో ఈ కంపెనీలపై చర్యలకు ఉపక్రమించింది.

న్యూఢిల్లీ: ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్వహించిన ల్యాబ్ పరీక్షల్లో పలు దిగ్గజ కంపెనీలు వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు వెల్లడైంది. సహజసిద్ధంగా పులియబెట్టడం (ఫర్మెంటేషన్), స్వేదనం (డిస్టిలేషన్), పీపాల్లో నిల్వ చేయడం (బ్యారెల్ ఏజింగ్) వంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా కాకుండా, తరువాయి 2 వ పేజీలో...



# రోడ్లపై పాదచారులకూ హక్కుంది..!

**ప్రతి రహదారిపై ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలి.. సుప్రీంకోర్టు ఆదేశాలు**

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతి రహదారిపై పాదచారులు సురక్షితంగా నడిచేలా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాదచారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ఫుట్‌పాత్‌లు లేదా ప్రత్యేక మార్గాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పాదచారుల భద్రతపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం తరువాయి 2 వ పేజీలో...

# సహజీవనమైనా '498-ఏ'

**భాగస్వామి వేధింపులకు క్రిమినల్ కేసులు.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు**



సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది.

ఢిల్లీ: వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవనం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



గణితశాస్త్రంలో అత్యంత ప్రాథమికమైన ప్రధాన సంఖ్యల గురించి శాస్త్రవేత్తలు మరో ఆసక్తికరమైన విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. వైడ్‌లీ డిజిటల్లీ డెలికేట్ ప్రైమ్ నంబర్స్ పేరుతో పూర్తిగా కొత్త తరహా ప్రధాన సంఖ్యల వర్గం ఉందని నిరూపించారు. ప్రస్తుతం ఈ వర్గానికి చెందిన నిర్దిష్ట సంఖ్యను గుర్తించలేకపోయినా, ఇలాంటి ప్రధాన సంఖ్యలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని రుజువు చేశారు. ప్రధాన సంఖ్యలు అంటే 1, ఆ సంఖ్య తప్ప మరే సంఖ్యతోనూ పూర్తిగా భాగించలేని సంఖ్యలు. ఇవే గణితశాస్త్రానికి పునాది రాళ్లుగా భావిస్తారు. సాధారణ డిజిటల్లీ డెలికేట్ ప్రైమ్ సంఖ్యల్లో ఏ ఒక్క అంకెను మార్చినా అవి ప్రధాన సంఖ్యలుగా ఉండవు. అయితే కొత్తగా గుర్తించిన ఈ వర్గం మరింత ప్రత్యేకమైనది. ఈ సంఖ్యల ముందు ఎన్ని సున్నాలు చేర్చినా, ఆ సున్నాల్లో ఏదైనా ఒకటి లేదా అసలు సంఖ్యలోని ఏ అంకెను మార్చినా, ఆ సంఖ్య వెంటనే ప్రధాన సంఖ్య హోదాను కోల్పోయి సమ్మేళన సంఖ్యగా మారుతుందని పరిశోధకులు వివరించారు.

# అక్రమ కేసులు

**పెద్దికి కాంగ్రెస్ సర్కారు వేధింపులు**

**బెడ్స్ కుంభకోణాన్ని బయటపెట్టారని టార్చర్**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపై తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్న ఆరోపణలు నిజమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను ఏ ఒక్కరినీ వదలకుండా వేధింపులకు, టార్చర్‌కు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తరువాయి 2 వ పేజీలో...

# ..డ్రామారావు కుట్రలు

**పెద్ది మరణంపై బీఆర్ఎస్ రాజకీయం**

**పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానం**

**అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్సే**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధ్వజం**



హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి తరువాయి 2 వ పేజీలో...



# మార్కెట్ల జోరు

**నాలుగో రోజూ లాభాలే**

**ముడి చమురు ధరల తగ్గుదల ఎఫెక్ట్**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గుతాయన్న అంచనాలతో పాటు అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరిగే అవకాశాలపై వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లలో సానుకూలత పెంచాయి. దీంతో సోమవారం తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

4.8.2026

మేషం: చిన్ననాటి మిత్రులతో కారణ కలహా సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. సంతాన విద్యా ఫలితాలు నిరుత్సాహ పరుస్తాయి. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

వృషభం: చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఋణదాతల నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు అధికారులతో నూతన సమస్యలు కలుగుతాయి. ఆర్థికంగా నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

మిథునం: సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక వృద్ధి కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు అమలు పరుస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి.

కర్కాటకం: చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. విలువైన వస్తులాభాలు పొందుతారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

సింహం: ముఖ్యమైన పనులు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

కన్య: చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

తుల: బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

ధనస్సు: నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబ పెద్దల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిలువక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

మకరం: ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు తప్పవు.

కుంభం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థికపరంగా అనుకూలత సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి స్నేహితులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో శుభఫలితాలు పొందుతారు.

మీనం: చిన్ననాటి మిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున మీ పని తీరుకు అధికారుల నుండి గుర్తింపు పొందుతారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు.



# భారత్‌లో 'కామన్వెల్త్ 2030'

తరువాయి 2 వ పేజీలో...

గేమ్స్ పతాకాన్ని అవనతం చేసిన తర్వాత గ్లాస్గో లార్డ్ ప్రొవోస్ట్ జాక్వెలిన్ మెక్‌లారెన్ దానిని భారత ప్రతినిధులైన నీరజ్ చోప్రా, పీటీ ఉషలకు అందజేశారు. దీంతో స్కాట్లాండ్ నుంచి భారత్‌కు అధికారికంగా ఆతిథ్య బాధ్యతలు బదిలీ అయ్యాయి. ఈ ఘట్టం తర్వాత, భారత సాంస్కృతిక వారసత్వాన్ని చాటుతూ అద్భుతమైన ప్రదర్శన సాగింది. 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే ప్రాచీన భారతీయ తత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సంగీతం, నృత్యం, కథల రూపంలో సాగిన ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ 3 తరఫున హాజరైన ప్రిన్స్ ఎడ్వర్డ్ మాట్లాడుతూ అథ్లెట్లను అభినందించారు. "నాలుగేళ్ల తర్వాత జరగనున్న 24వ కామన్వెల్త్ క్రీడల కోసం, అలాగే శతాబ్ది ఉత్సవాల కోసం మీరందరూ అహ్మదాబాద్‌కు రావాలని నేను ఆహ్వానిస్తున్నాను" అని ఆయన పిలుపునిచ్చారు. కాగా, ఈ ముగింపు వేడుకల్లో భారత పతాకధారిగా మహిళల 57 కేజీల బాక్సింగ్‌లో స్వర్ణం గెలిచిన జాస్మిన్ లాంబోరియా వ్యవహరించారు.

## అక్రమ కేసులు

**మొదటి పేజీ తరువాయి**

కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేవారని, ప్రభుత్వంలోని అక్రమాలను నిరంతరం బయటపెట్టేవారని కేటీఆర్ గుర్తుచేశారు. సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలోని బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని చెప్పారు. ఆ ఆధారాలను ఈడీ కార్యాలయానికి అందజేయడమే కాకుండా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని తెలిపారు. అయితే, సుదర్శన్ రెడ్డి మరణించిన మరునాడే సుప్రీంకోర్టు నుంచి నోటీసులు జారీ అవుతూ గైడెన్స్ రావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వ్యక్తులు ఆయన విమర్శలను తట్టుకోలేక, అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను ప్రధాని మోదీ నిలిపివేసారని సీఎం రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని, ఆయన చేసిన తీర్మానం కేవలం ఒక చిత్తు కాగితమని కొట్టిపారేశారు. సోనియా గాంధీ తెచ్చిన విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారా అని ప్రశ్నించారు. గురుకులాల్లో 150 మంది విద్యార్థులు చనిపోవడం, 7 వేల ఐటీ ఉద్యోగాలు పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. గోదావరిలో నీళ్లు సముద్రం పాలు అవుతున్నా రైతాంగానికి నీళ్లందించకుండా ఎండబెడుతున్నారని మండిపడ్డారు. పంపింగ్ ద్వారా నీళ్లు మిడ్ మానేరుకు ఎలా వస్తున్నాయో తెలియని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హెలికాప్టర్లలో వెళ్లి పోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేయడం వెనుక రూ.200 కోట్లు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు వేసిన స్కెచ్ ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే కుట్రలు సాగుతున్నాయని అన్నారు.

## పెగ్గులో ఫ్లేవర్ ఫ్రాడ్!

**మొదటి పేజీ తరువాయి**

తటస్థ ఆల్కహాల్‌లో బయటి నుంచి 'రమ్ ఫ్లేవర్' లేదా 'విస్కీ ఫ్లేవర్' వంటి వాటిని కలుపుతున్నట్లు గుర్తించారు. ఇలా చేయడం ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది. ఇలాంటి ఉత్పత్తులను ప్యాకెట్ ముందు భాగంలో 'రమ్-ఫ్లేవర్డ్ స్పిరిట్' లేదా 'విస్కీ-ఫ్లేవర్డ్ స్పిరిట్' అని స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించింది. లేబుళ్లపై మద్యం నిల్వ కాలం గురించి తప్పుడు వివరాలు ఇస్తున్నట్లు కూడా అధికారులు గుర్తించారు. ఉదాహరణకు, ఓల్డ్ మాంక్ బ్రాండ్‌పై '7 ఇయర్స్ ఓల్డ్ బ్లెండెడ్' అని ఉన్నప్పటికీ, అందులో 95 శాతం కంటే ఎక్కువ భాగం కొత్తగా తయారుచేసిన తటస్థ ఆల్కహాల్ ఉండగా, ఏళ్ల తరబడి నిల్వ ఉంచిన స్పిరిట్ 5 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు తేలింది. నిబంధనల ప్రకారం, మిశ్రమంలోని అత్యంత తక్కువ వయసున్న స్పిరిట్‌నే వయసుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ ఉల్లంఘనల నేపథ్యంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోని మోహన్ రాకీ స్ప్రింగ్‌వాటర్, యునైటెడ్ స్పిరిట్స్, ఇన్‌బ్రూ బేవరేజెస్, అసోసియేటెడ్ ఆల్కహాల్ అండ్ బ్రూవరీస్ వంటి కంపెనీలకు చెందిన కొన్ని ప్లాంట్లలో ఉత్పత్తుల అమ్మకాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధించింది. గోవాలోని యూనిట్ల నుంచి శాంపిళ్లను సేకరించి, కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. అయితే, ఇది మద్యం పరిశ్రమపై పూర్తిస్థాయి నిషేధం కాదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేశాయి.

## కమలాన్ని పీకేశాడు!

**మొదటి పేజీ తరువాయి**

నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం విశేషం.

### ఫలించిన పీకే వ్యూహం

1995 నుంచి బాంకీపూర్ (గతంలో పట్నా వెస్ట్) బీజేపీకి అత్యంత సురక్షితమైన స్థానం. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన నితిన్ నబిన్ ఈ స్థానం నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచారు. ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. 2025 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నితిన్ నబిన్ ఏకంగా 51,000 ఓట్ల మెజారిటీతో, 62 శాతానికి పైగా ఓట్ షేర్‌తో గెలిచారు. కానీ, తాజా ఉపఎన్నికలో బీజేపీ ఓట్ షేర్ 34 శాతానికి పడిపోవడం గమనార్హం. ఈ ఓటమికి అనేక కారణాలు దోహదం చేశాయి. ముఖ్యంగా అభ్యర్థి ఎంపికలో బీజేపీ చేసిన తప్పిదం ప్రధానంగా కనిపిస్తోంది. మొదట అభిషేక్ కుమార్ సిన్హాను అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, ఆయన తల్లిదండ్రులు దాణా కుంభకోణంలో దోషులుగా తేలారనే వార్తల నేపథ్యంలో ఆయన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. చివరి నిమిషంలో యువమోర్చా నేత నీరజ్ కుమార్ సిన్హాను బరిలోకి దించారు. ఈ ఆకస్మిక మార్పు ఓటర్లలో గందరగోళం సృష్టించడమే కాకుండా, ప్రచారానికి కొత్త అభ్యర్థికి తగినంత సమయం లేకుండా పోయింది. ఈ అవకాశాన్ని ప్రశాంత్ కిశోర్ చక్కగా వినియోగించుకున్నారు. 2025 ఎన్నికల్లో కేవలం అభ్యర్థులను నిలబెట్టి విఫలమైన ఆయన, ఈసారి స్వయంగా బరిలోకి దిగారు. స్థానిక సమస్యలు, యువత, నిరుద్యోగం, పాలనాపరమైన అంశాలను ప్రస్తావిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన వ్యూహం ఫలించి బీజేపీకి సంప్రదాయకంగా మద్దతిచ్చే అగ్రవర్ణ ఓట్లతో పాటు యాదవ్, ముస్లిం, దళిత, ఇతర వెనుకబడిన వర్గాల ఓట్లను గణనీయంగా సాధించారు. ఉపఎన్నికకు ముందు రాష్ట్రంలో నెలకొన్న కొన్ని సంఘటనలు కూడా బీజేపీపై వ్యతిరేకతను పెంచాయి. నీట్ వంటి పరీక్షల అవకతవకలపై విద్యార్థుల నిరసనలు, వారిపై పోలీసుల చర్యలు తీవ్ర ప్రభావం చూపాయి. జూన్ 2026లో భోజ్‌పూర్ జిల్లాలో విద్యార్థి నేత భరత్ భూషణ్ తివారీని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపడం రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలను రేపింది. ఈ ఘటన సొంత పార్టీ కేడర్‌లోనూ నిరుత్సాహాన్ని నింపినట్లు తెలుస్తోంది. నితీశ్ కుమార్ స్థానంలో సామ్రాట్ చౌదరిని సీఎం చేయడం, మిత్రపక్షమైన జేడీయూ ప్రచారంలో చురుగ్గా పాల్గొనకపోవడం, 2025లో భారీ విజయం తర్వాత వచ్చిన అతివిశ్వాసం కూడా బీజేపీ కొంపముంచాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎల్ నినో.. కాదు కుంభవృష్టి!

**మొదటి పేజీ తరువాయి**

ప్రవర్తన తనను కంటతడి పెట్టిస్తోందని, మనశ్శాంతి లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యవాణిలో స్వర్ణలత మాట్లాడుతూ.. 'నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తానని మాటిచ్చి నిలబెట్టుకోలేదు. అయినా ప్రజలను నేను కాపాడుతూనే ఉన్నా. ఏ ఆపద వచ్చినా అడ్డుకుంటున్నా. కానీ నా మాట మీరు వినడం లేదు. ఇది నాకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఈ ఏడాది కుంభవృష్టి రూపంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని, వాటి వల్ల ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు వావివరసలు మరిచి ప్రవర్తిస్తున్నారు. ఘోరాలు చేస్తున్నారు. వారిని నేను వదిలిపెట్టను' అని చెప్పారు. తనకు ఇచ్చిన మాట ప్రకారం రాబోయే ఆరు నెలల్లోగా విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని అమ్మవారు ఆదేశించారు. అలా చేయని పక్షంలో భారీ ప్రాణనష్టం జరిపిస్తానని హెచ్చరించారు. 'నాకు అడ్డు వచ్చిన వాళ్లను పాదాల కింద వేసి నలిపేస్తా. మీరు గాలికి వదిలేసిన పిల్లల్ని నేను కాపాడుతా. కానీ మీరు నన్ను నిరుత్సాహపరుస్తున్నారు' అంటూ అమ్మవారి వాణిని వినిపించారు.

## రోడ్లపై పాదచారులకూ హక్కుంది..!

**మొదటి పేజీ తరువాయి**

ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌కు అవసరమైన మార్గదర్శకాలను సూచించింది. 'దేశంలో కొత్తగా నిర్మించే లేదా పునర్నిర్మించే ప్రతి రహదారిలో పాదచారులకు ప్రత్యేక మార్గం తప్పనిసరిగా ఉండాలి. ఇందుకోసం భారీ వ్యయం అవసరం లేదని, కనీసం రంగు గీతలు, తాళ్లు లేదా ఇతర గుర్తులతో అయినా పాదచారుల మార్గాన్ని స్పష్టంగా గుర్తించవచ్చని సూచించింది. పాదచారుల కోసం కేటాయించిన స్థలాల్లో ఆక్రమణలు, వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారాలను అనుమతించరాదు. పాదచారులు వేగంగా వచ్చే వాహనాల భయం లేకుండా స్వేచ్ఛగా నడిచే వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ బాధ్యత' అని స్పష్టం చేసింది. ఈ అంశంపై సంబంధిత మంత్రిత్వ శాఖలు, అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. జూన్ 19న కూడా ఇదే అంశంపై విచారణ సందర్భంగా, ఫుట్‌పాత్‌పై సురక్షితంగా నడవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డీ) కింద స్వేచ్ఛగా సంచరించే హక్కు, ఆర్టికల్ 21 కింద గౌరవప్రదంగా జీవించే హక్కులో పాదచారుల భద్రత కూడా అంతర్భాగమేనని పేర్కొంది.

## ..డ్రామారావు కుట్రలు

**మొదటి పేజీ తరువాయి**

ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్‌ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్‌ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

## మార్కెట్ల జోరు

**మొదటి పేజీ తరువాయి**

కొనుగోళ్ల జోరు కనిపించింది. సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 391 పాయింట్లు ఎగిసి 24,774.30 వద్ద స్థిరపడింది. కొత్తగా ప్రవేశపెట్టిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సీఏఎస్) ప్రభావంతో నిఫ్టీలో మరింత బలమైన ర్యాలీ కనిపించింది. మార్కెట్‌లో ఐటీ షేర్లు ప్రధానంగా రాణించాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నిఫ్టీలో అత్యధిక లాభాలు నమోదు చేశాయి. ఐటీ రంగంలో కొనుగోళ్లు పెరగడం మార్కెట్‌కు బలాన్నిచ్చింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.21 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.29 శాతం లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు మంచి లాభాలు నమోదు చేశాయి. మరోవైపు నిఫ్టీ మీడియా సూచీ మాత్రం నష్టాల్లో ముగిసింది. సాంకేతికంగా నిఫ్టీకి 24,600 స్థాయి కీలక నిరోధంగా మారిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిని దాటితే 24,800 వరకు సూచీ వెళ్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు 24,500 నుంచి 24,400 మధ్య స్థాయి కీలక మద్దతుగా నిలుస్తుందని, ఈ స్థాయి దిగువకు వస్తే స్వల్పకాలిక లాభాల స్వీకరణ పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## సహజీవనమైనా '498-ఏ'

**మొదటి పేజీ తరువాయి**

చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది.

## భాగ్యనగరంలో బ్రిక్స్

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సు జరగనుంది. బ్రిక్స్-2026 అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆగస్టు 4, 5 తేదీల్లో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యాచరణ బృందం రెండో సమావేశం, ఆస్తుల రికవరీపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశానికి నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. భారత ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం (డీవోపీటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాలకు 'స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తాన్ని నిర్ణయించారు. సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా సమావేశాన్ని ప్రారంభించనున్నారు. బ్రిక్స్ సభ్యదేశాల నుంచి సీనియర్ విధాన రూపకర్తలు, అవినీతి నిరోధక నిపుణులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. జూన్‌లో వర్చువల్ విధానంలో నిర్వహించిన తొలి సమావేశం అనంతరం జరుగుతున్న ఈ ప్రత్యక్ష సమావేశంలో అంతర్జాతీయ స్థాయిలో అక్రమ ఆస్తుల రికవరీని వేగవంతం చేయడం, సరిహద్దులు దాటి జరిగే అవినీతిని అరికట్టేందుకు సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయడం, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడం వంటి అంశాలపై సభ్యదేశాలు విస్తృతంగా చర్చించనున్నాయి. అవినీతి కేసుల్లో విదేశాలకు పారిపోయిన నేరస్తుల ఆచూకీని గుర్తించడం, వారి అప్పగింత ప్రక్రియలో అనధికారిక సహకారాన్ని మెరుగుపరచడం కూడా సమావేశంలో ప్రధాన అంశంగా ఉండనుంది.

## 1000 రోబోటిక్ సర్జరీలు

**మొదటి పేజీ తరువాయి**

యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.

# సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్ నింపగలవా?

**సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు**




హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చిందని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని విమర్శించారు. ఉద్యోగాలు రాక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరుద్యోగులు అడిగితే సీఎం రేవంత్ రెడ్డి "ఎండ్రిన్ తాగి చావండి" అన్నట్లుగా మాట్లాడటం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సీఎం రేవంత్ సంబోధించడం బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపిస్తూ "అసలైన క్రిమినల్ వేస్ట్ ఆయనే" అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతితో తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణ నిరుద్యోగుల సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్హతపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఆయన అసలు ఏం చదివారో కూడా అనుమానమేనని అన్నారు. ఎవరి సాయం లేకుండా ఎన్నికల అఫిడవిట్‌ను నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూకైనా హాజరయ్యారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల కష్టాలు రేవంత్‌కు ఏమాత్రం తెలియవని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా, కేంద్ర నిధుల కొరత ఉన్నా రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తుందో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## లక్షమందితో కొడంగల్‌లో నామినేషన్లు

**వచ్చే ఎన్నికల్లో బరిలో ఇంజినీరింగ్ విద్యార్థులు**

**రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి ఫైర్**



హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): ఇంజినీరింగ్ విద్యార్థులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారానికి కారణం అయ్యాయి. ఇంజినీరింగ్ విద్యార్థులు క్రిమినల్ వేస్ట్ అన్న వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో స్పందించింది. సీఎం వెంటనే విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పార్టీ నేతలు ఆందోళనకు దిగారు. వచ్చే ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో లక్ష మంది ఇంజినీరింగ్ విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేసే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి హెచ్చరించారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రే విద్యార్థులను అవమానించేలా మాట్లాడడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో స్కిల్ గ్యాప్ ఉంటే.. దాన్ని ఎలా అధిగమించాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిపోయి వారినే కించపరచడం సరైంది కాదని రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. హార్వర్డ్‌లో శిక్షణ తీసుకుని వచ్చిన తర్వాత అయినా ప్రభుత్వ పనితీరులో మార్పు వస్తుందని భావించామని.. కానీ అలాంటిది కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ఇప్పుడు ఇంజినీర్లపై చేసిన వ్యాఖ్యలతో ఐటీ, తయారీ రంగాల ప్రతిష్ఠ కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్టీసీలో 1743 ఉద్యోగాల ఫలితాలు విడుదల

**ఈనెల 17న సర్టిఫికెట్ వెరిఫికేషన్**

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): టీజీఎస్ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీకి సంబంధించిన ఎంపిక ఫలితాలను తెలంగాణ పోలీసు నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) సోమవారం ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబర్ 17వ తేదీన మొత్తం 1,743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి 1,604 మంది అభ్యర్థులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు బోర్డు వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలతో పాటు కేటగిరీ వారీ కటాఫ్ మార్కులను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందులో 1,000 డ్రైవర్ పోస్టులకు 894 మందిని సెలెక్ట్ చేయగా.. 743 శ్రామిక్ పోస్టులకు 710 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. డ్రైవర్ పోస్టులకు హాజరైన అభ్యర్థులు తమ డ్రైవింగ్ టెస్ట్ మార్కుల షీట్‌లను వ్యక్తిగత లాగిన్‌లో చూసుకోవచ్చని బోర్డు అధికారులు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు తుది నియామకం వెంటనే జరగదని.. వారి వ్యక్తిత్వ ధ్రువీకరణ, ప్రవర్తన పరిశీలన, వైద్య పరీక్షల్లో అర్హత సాధించిన తర్వాత మాత్రమే నియామక ప్రక్రియ పూర్తవుతుందని బోర్డు స్పష్టం చేసింది. అభ్యర్థులు ఆగస్ట్ 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఆగస్ట్ 11వ తేదీ అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్‌లో డిజిటల్ అటెస్టేషన్ ఫారాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించింది. ఆ తర్వాత ఆగస్ట్ 17వ తేదీన 3 అటెస్టేషన్ ఫారాల ప్రింట్ కాపీలు, విద్యార్హతలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలతో కలిసి తమకు కేటాయించిన పోలీసు జిల్లా లేదా కమిషనరేట్ కార్యాలయాలకు హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొనాలని టీఎస్ఎల్పీఆర్బీ బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. అభ్యర్థులు తమ సెలక్షన్, కటాఫ్ మార్కులు, ఇతర వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి.. ఆ తర్వాతి ప్రక్రియలకు అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## ఇంటర్‌లో సింథటిక్ మెమోలు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందించే మార్కుల మెమోలవిషయంలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అందజేసే మార్కుల జాబితాలు నీటిలో తడవవు, చేత్తో లాగినా చిరగవు. అత్యంత నాణ్యమైన, మన్నికైన నాన్ టియరబుల్ టెక్నాలజీతో కూడిన ప్రత్యేక మెమోలను ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి తీసుకురానున్నారు. సాధారణ కాగితంతో కాకుండా ప్రత్యేక సింథటిక్ మెటీరియల్‌తో వీటిని రూపొందిస్తుండటం వల్ల ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా లేదా లాగినా ఇవి చిరిగిపోవని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిఏటా సుమారు 9.50 లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతుండగా.. ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులయ్యే దాదాపు 4 లక్షల మంది విద్యార్థులకు ఈ సరికొత్త లాంగ్ మెమోలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. గతంలో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా అనేకమంది విద్యార్థుల ఇళ్లలోకి నీరు చేరి వారి విద్యా సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు పూర్తిగా తడిచి పాడైపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా డూప్లికేట్ మెమోలు జారీ చేసింది. ఆ ఘటనల నుంచి పాఠాలు నేర్చుకున్న ఇంటర్ బోర్డు.. ఎప్పటికీ పాడవని, చిరగని శాశ్వత మెమోలను తేవాలని నిర్ణయించింది. పొరపాటున ఈ కొత్త మెమోలు నీటిలో మునిగినా లేదా తడిసినా అందులోని అక్షరాలు, సమాచారం అస్సలు చెరిగిపోవు. అంతేకాకుండా పేపర్ మెత్తబడదు. ఈ మన్నికైన మెటీరియల్ వల్ల విద్యార్థులు వీటిని బయట ప్రత్యేకంగా లామినేషన్ చేయించుకోవాల్సిన అవసరం కూడా ఉండదని బోర్డు స్పష్టం చేసింది.

## జోగినులకు అండగా ప్రభుత్వం: పొన్నం



సికింద్రాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినుల కోసం కీలక ప్రకటనలు చేశారు. జోగినులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) జారీ చేయడంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలందరికీ ఇది అత్యంత శుభదినమని, అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, విశిష్ట సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కాస్త ఒత్తిడి పెరిగినప్పటికీ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో సేవలందించారని కొనియాడారు. జోగినులకు సమాజంలో తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినులను మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయ, హోం, మున్సిపల్ శాఖల సమన్వయంతో బోనాల ఏర్పాట్లను మరింత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. జోగినులకు అధికారిక గుర్తింపు కల్పించడంపై సంబంధిత శాఖ మంత్రితో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



## మిలిటెంట్ పోరాటమే

**ఫీజు బకాయిలపై సర్కారుకు ఆర్ కృష్ణయ్య వార్నింగ్**

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులో జాప్యం కొనసాగితే మిలిటెంట్ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం సోమవారం హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రశ్నిస్తే తాను ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని, కాబట్టి ఏపీలోనే పోరాటం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం బాధాకరమని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొంత బకాయి ఉన్నప్పటికీ అక్కడ అమలవుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం మెరుగ్గా ఉందని అన్నారు. విద్యార్థుల పూర్తి ఫీజును అక్కడ ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. తెలంగాణలో మాత్రం ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.35 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో విద్యార్థుల పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించే విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బకాయిల విడుదలతో పాటు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## రాజన్న అన్నసత్రంలో ఈవో ఆకస్మిక తనిఖీలు

వేములవాడ అర్బన్, ఆగస్టు 3 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నప్రసాద సత్రంలో భక్తులకు ఉచితంగా అందిస్తున్న అన్నప్రసాద సేవలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సత్రంలో నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర ఆహార సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వంటశాలను సందర్శించి వంటకు వినియోగిస్తున్న బండలు, స్టవ్‌లు, వంట పాత్రలు, ఇతర సామగ్రి పరిశుభ్రతను తనిఖీ చేశారు. అన్నప్రసాద సత్రంలో భోజనం చేస్తున్న భక్తులకు ఈవో స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి, ఆహారం నాణ్యత, రుచి, సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. పాత్రలు శుభ్రం చేసే సిబ్బందితో మాట్లాడిన ఈవో, ప్రతి పాత్రను పరిశుభ్రంగా కడగాలని, వంటశాల పరిసరాల్లో ఎల్లప్పుడూ పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. సత్రంలోని వివిధ విభాగాలను పరిశీలించిన అనంతరం అన్నప్రసాద పర్యవేక్షకులు ఒన్నారం భాస్కర్‌తో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సత్రానికి వచ్చే ప్రతి భక్తితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి అవసరాలు, సూచనలు వెంటనే తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన అన్నప్రసాదాన్ని అందించడం దేవస్థానం ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఈవో ఎల్. రమాదేవి, అన్నప్రసాద సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## 400కే జియో వైఫై, టీవీ, ఓటీటీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): రిలయన్స్ జియో మరోసారి తన వినియోగదారులకు ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని గృహ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని జియోహోమ్ పేరుతో కొత్త బ్రాడ్‌బ్యాండ్, హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త ప్లాన్‌లలో హైస్పీడ్ వైఫై ఇంటర్నెట్‌తోపాటు 1,000కు పైగా లైవ్ టీవీ ఛానెల్స్.. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల సబ్‌స్క్రిప్షన్లు ఒకే కనెక్షన్‌లో లభించనున్నాయి. నెలకు కేవలం రూ.400 ప్రారంభ ధరతో ఈ సేవలను అందిస్తోంది.

## 175 నిమిషాల్లోనే అగ్గిపెట్టెలో పట్టే చీర తయారీ

**సిరిసిల్ల నేతన్న అద్భుతం**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 3 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన నేతన్న వెల్ది హరిప్రసాద్ అరుదైన ఘనత సాధించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కేవలం 175 నిమిషాల్లోనే పూర్తిస్థాయి పట్టు చీరను నేసి.. దాన్ని అగ్గిపెట్టెలో పట్టేలా మడిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. సంప్రదాయ చేనేత మగ్గంపై ఈ ఫీట్ సాధించాడు. సాధారణంగా ఒక చీరను నేయడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. అయితే హరిప్రసాద్ మాత్రం ఎలాంటి విరామం లేకుండా పూర్తిగా ఏకాగ్రతతో కేవలం 2 గంటల 55 నిమిషాల్లోనే ఈ చీరను నేయడం విశేషం. 5.5 మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు, 175 గ్రాముల బరువున్న పట్టు చీరను నేసి హరిప్రసాద్ సరికొత్త రికార్డు నెలకొల్పారు. అంతటితో ఆగకుండా.. ప్రత్యేక నైపుణ్యంతో ఆ చీరను మడిచి 12 సెంటీమీటర్ల పొడవు.. 6.5 సెంటీమీటర్ల వెడల్పు.. 2.5 సెంటీమీటర్ల ఎత్తు ఉన్న సాధారణ అగ్గిపెట్టెలో ఇమిడేలా చేసి తన కళాత్మక ప్రతిభను చాటిచెప్పారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలోకి సర్కారు విద్యార్థులకు ఫ్రీ ఎంట్రీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మన దేశ సంస్కృతి, పూర్వీకుల వారసత్వ సంపదపై స్పష్టమైన అవగాహన కల్పించే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని ప్రపంచ ప్రసిద్ధ సాలార్‌జంగ్ మ్యూజియంలోకి సర్కారు బడుల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ వెల్లడించారు. ఈ విద్యా విహారయాత్రలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ విహారయాత్రల ప్రక్రియ మొత్తాన్ని ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో నికోలస్ స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే కాకుండా, గుర్తింపు పొందిన ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్ల విద్యార్థులు కూడా ఈ ఉచిత అవకాశాన్ని వినియోగించుకుని మ్యూజియాన్ని సందర్శించవచ్చునని అధికారులు తెలిపారు. అయితే, విహారయాత్రల ఎంపికలో ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డీఈవోలకు సూచించారు. చిన్నతనం నుంచే చారిత్రక అంశాలు, కళలపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పడుతుందని విద్యాశాఖ భావిస్తోంది.

## టీటీడీ ఆసుపత్రుల్లో భారీ అవినీతి

**లోకేశ్‌పై భూమన తీవ్ర ఆరోపణలు**

తిరుమల, ఆగస్టు 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి తీవ్ర స్థాయికి చేరుకుందని వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ అవినీతిలో మంత్రి నారా లోకేశ్ పాత్ర స్పష్టంగా ఉందని ఆరోపించారు. తిరుపతిలోని ప్రసిద్ధ స్విమ్స్, పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. పవిత్రమైన ధార్మిక సంస్థ అయిన టీటీడీని కూడా వదిలిపెట్టకుండా ఇష్టమొచ్చినట్లు పట్టి పీడిస్తున్నారని ధ్వజమెత్తారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాల నుంచి పెద్ద పెద్ద యంత్రాల టెండర్ల వరకు తీవ్రస్థాయిలో గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారని, కంపెనీలతో ముందే లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, తక్కువ ధరకు లభించే పరికరాలను టీటీడీకి ఎక్కువ ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఏపీలో మహిళలకు రుణాల సర్వీస్ చార్జీలు మాఫీ

విజయవాడ, ఆగస్టు 3 (ఈవార్తలు): రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామీణ బ్యాంకులలో ఇచ్చే రుణాలపై సర్వీస్ ఛార్జీలను పూర్తిగా మాఫీ చేసింది. ఈ విషయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులలో డ్వాక్రా మహిళలు పొందే రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ ఛార్జీలను రద్దు చేశారు. అలాగే ఇన్‌స్పెక్షన్, పాస్‌బుక్ ప్రింటింగ్, క్యాష్ హ్యాండ్లింగ్ రుసుములను కూడా రద్దు చేసినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ఐదు లక్షల రూపాయల కంటే ఎక్కువ రుణాలపై 13 శాతంగా ఉన్న వడ్డీ రేటును 12 శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. జూలై ఒకటో తేదీ నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చే రుణాలపై ఎలాంటి సేవా రుసుములు వసూలు చేయవద్దని బ్యాంకులకు సూచించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకులు స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును ఇప్పటికే మాఫీ చేశాయని.. ఇతర బ్యాంకులు కూడా అన్ని రకాల సేవా రుసుములను మాఫీ చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ ప్రయోజనాలపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామ సంఘాలు, సెర్ప్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించనున్నట్లు మంత్రి వివరించారు.

## కడప ఎయిర్‌పోర్ట్ లంచం.. మాజీ అధికారికి మూడేళ్ల జైలు

కడప, ఆగస్టు 3 (ఈవార్తలు): కడప ఎయిర్‌పోర్ట్‌లో తొమ్మిదేళ్ల క్రితం నమోదైన లంచం కేసులో కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎయిర్‌పోర్ట్ మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే, కడప ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)గా, తాత్కాలిక ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్, ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేశారు. ఆ కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులను త్వరగా ప్రాసెస్ చేసేందుకు, అతని సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఉండేందుకు రూ. 50,000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై బాధితుడు సీబీఐని ఆశ్రయించడంతో 2015 జూలై 24న శ్రీనివాసన్‌పై కేసు నమోదైంది. అనంతరం, లంచంలో మొదటి విడతగా రూ. 25,000 నగదు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తన అధికారిక హోదాను దుర్వినియోగం చేసి లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ తన దర్యాప్తులో నిర్ధారించింది. ఈ కేసుకు సంబంధించి లోతైన దర్యాప్తు జరిపిన సీబీఐ, 2016 ఫిబ్రవరి 29న కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం, తాజాగా సాక్ష్యాధారాలను పరిశీలించిన కర్నూలు సీబీఐ ప్రత్యేక కోర్టు.. శ్రీనివాసన్‌ను దోషిగా నిర్ధారిస్తూ పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. ఈ మేరకు సీబీఐ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించింది.



## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన.. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 3 (ఈవార్తలు): బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి, నర్సింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలు-1, 2లో ఐసీడీఎస్ సీడీపీఓ సౌందర్య ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. వైద్య నిపుణులు, అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లుల్లో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గడంతో పాటు గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి దోహదపడుతుందని వివరించారు. అలాగే శిశువులకు తల్లిపాలు అందించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి, న్యూమోనియా, విరేచనాలు, ఊబకాయం, మధుమేహం, అలర్జీలు వంటి సమస్యల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లిపాలలో ఎ, డి, ఈ, కె విటమిన్లు సమృద్ధిగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీపతి నందనకృష్ణం, కొలుపుల బాబు అనే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య, నర్సింగాపూర్ సర్పంచ్ మాడిశెట్టి సరిత, గ్రామ కార్యదర్శి రామ్, డాక్టర్ శాంశక్, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు లక్ష్మి, బూరుగుపల్లి అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, రాజేశ్వరి, నర్సింగాపూర్ అంగన్‌వాడీ టీచర్లు విజయ, శంకరమ్మ, ఆయా రాజవ్వ, వసంత, వార్డు సభ్యులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గడి బురుజు భూమిపై వీఎల్‌టీ రద్దు చేయాలి

**కలెక్టర్‌కు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వినతి**

జగిత్యాల, ఆగస్టు 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కోరుట్ల పట్టణంలోని గడి బురుజు భూమికి విధించిన వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ)ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గడి బురుజు భూమికి చారిత్రక, ప్రజా ప్రాధాన్యం ఉందని, ప్రజా ప్రయోజనాల కోసం దాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. భూమిపై విధించిన వీఎల్‌టిని రద్దు చేసి, వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి ప్రజాభిప్రాయానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మరో వినతిపత్రం అందజేశారు. నిధులు విడుదల కాక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని విద్యాసంస్థలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తూ సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు సమస్యలపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రజలకు, విద్యార్థులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కోరారు.





## సాయి రూప ట్రస్ట్‌కు వంట సామాగ్రి విరాళం

వేములవాడ అర్బన్, ఆగస్టు 3 (ఈవార్తలు): సాయి రూప చారిటబుల్ ట్రస్ట్‌కు ట్రస్ట్ ముఖ్య సభ్యులు, ఎన్నారై సంకుర్తి వేణు వంట సామాగ్రిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంకుర్తి వేణు మాట్లాడుతూ, సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి ట్రస్ట్ అవసరాల కోసం వంట సామాగ్రిని అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. వంట సామాగ్రిని విరాళంగా అందించిన సంకుర్తి వేణుకు ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు, వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండి రాజు-సరళ, కోశాధికారి దూలం భూమేష్ గౌడ్‌తో పాటు ట్రస్ట్ సభ్యులు అఖిలేష్ రెడ్డి, మహేందర్, మల్కాపురం ప్రశాంత్ గౌడ్, మోత్కుపల్లి శ్రీనివాస్ యాదవ్, శివరాత్రి వెంకటేష్, వేముల సతీష్, నందగిరి సత్యం గౌడ్, వాసాల హరిప్రసాద్, గోంటి నవీన్, పబ్బ సురేష్, అడిగొప్పుల విద్యశ్రీ, ఇట్టే పూజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి సహకరిస్తున్న దాతలందరికీ ట్రస్ట్ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## వేములవాడ - జగిత్యాల బస్టాండ్ భూముల్లో నిర్మాణాలెలా?

**జిల్లా కలెక్టర్‌కు వేములవాడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదు**



వేములవాడ అర్బన్, ఆగస్టు 3 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని ప్రతిపాదిత జగిత్యాల బస్టాండ్ కోసం ప్రభుత్వ అవసరాల నిమిత్తం సేకరించిన భూముల్లో నిర్మాణ అనుమతులు జారీ చేసిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ అంశంపై వేములవాడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ రామతీర్థపు మాధవి రాజు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బస్టాండ్ కోసం సేకరించిన భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని గతంలో ఆదేశాలు ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొందరికి నిర్మాణ అనుమతులు మంజూరు చేశారని ఆమె ఆరోపించారు. గెజిట్‌ను ఆధారంగా చేసుకుని టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ అనుమతుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కూడా ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ఆ ప్రాంతానికి చెందిన భూ యజమానులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంబంధిత గెజిట్‌ను రద్దు చేయాలని లేదా భూములకు తగిన పరిహారం చెల్లించే అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటివరకు జారీ చేసిన నిర్మాణ అనుమతులన్నింటినీ సమీక్షించి, అవసరమైతే వాటిని రద్దు చేసి బాధితులందరికీ సమన్యాయం చేయాలని కోరారు. బస్టాండ్ ప్రాంతంలోని నిర్మాణ అనుమతుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

# అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం

**ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు.. జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ**

**ఇది టీడబ్ల్యూజేఎఫ్ విజయం:మామిడి సోమయ్య**

హైదరాబాద్, ఆగస్టు 3 (ఈవార్తలు): రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హులున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరఫున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు. ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.

## ఎల్లంపల్లి నీళ్లు అవి.. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జగిత్యాల, ఆగస్టు 3 (ఈవార్తలు): ఎల్లంపల్లి ప్రాజెక్టు, నియోజకవర్గ అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ సోమవారం నంది మేడారం పంప్‌హౌస్ వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నంది పంప్‌హౌస్ ద్వారా నంది మేడారం చెరువును నింపుతున్న నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచే వస్తోందని పేర్కొన్నారు. ఎల్లంపల్లి నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులు కొప్పుల ఈశ్వర్, జీవన్‌రెడ్డి తమ వ్యాఖ్యలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిధుల్లేక పంచాయతీల అభివృద్ధి కుంటు

**ప్రత్యేక నిధులు విడుదల చేయాలి**

**శానబండ సర్పంచ్ గాదం భాస్కర్ డిమాండ్**

ఎండపల్లి, ఆగస్టు 3 (ఈవార్తలు): గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఎండపల్లి మండలం శానబండ సర్పంచ్ గాదం భాస్కర్ అన్నారు. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు అందడం లేదన్నారు. నిధులు లేక తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్వహణతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పన కూడా కష్టంగా మారిందన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు గతంలో పేరుకుపోయిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకే సరిపోతున్నాయని తెలిపారు. దీంతో కొత్త అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. గ్రామస్థాయిలో ప్రజాపాలన సక్రమంగా అమలు కావాలంటే పంచాయతీలకు తగినన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గాదం భాస్కర్ కోరారు.

## పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు ఎస్పీ అభినందన



జగిత్యాల, ఆగస్టు 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కేవలం ఒక సంఘంగా కాకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధికి వేదికగా నిలవాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. జిల్లా పోలీసుశాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా అసోసియేషన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా జీవన్‌రాజ్ (కానిస్టేబుల్), ఉపాధ్యక్షులుగా ఆరిఫ్ అలీఖాన్ (ఇన్‌స్పెక్టర్), శ్రీకాంత్ (ఎస్ఐ), కార్యదర్శిగా కిరణ్‌కుమార్ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్), జాయింట్ సెక్రటరీగా కేశవేని సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.మల్లేశం, ట్రెజరర్‌గా మాటి రమేష్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా అనుగుల మహేష్, ఎ.రాజేశ్వర్, కొలగాని జలపతి, డి.సౌందర్య, కొలుగాని మల్లేశం, గోశెట్టి విద్యానాథ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన నితిన్, నూతన కార్యవర్గ సభ్యులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## రాజన్నకు రూ.3.50 లక్షల బంగారు గొలుసు విరాళం

వేములవాడ అర్బన్, ఆగస్టు 3 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఓ భక్త కుటుంబం భక్తిశ్రద్ధలతో సుమారు రూ.3.50 లక్షల విలువైన 37 గ్రాముల రాళ్లతో కూడిన మిశ్రమ బంగారు గొలుసును విరాళంగా సమర్పించింది. దేవస్థానం రికార్డుల ప్రకారం వేములవాడ బ్రహ్మంగారి వీధికి చెందిన బాయి విద్యాసాగర్ శర్మ-సురేఖ దంపతులు సోమవారం స్వామివారికి ఈ బంగారు గొలుసును కానుకగా అందజేశారు. దేవస్థానం అధికారులు గొలుసు బరువు 37 గ్రాములు, సుమారు రూ.3.50 లక్షల విలువ ఉన్నట్లు నమోదు చేశారు. ఈ సందర్భంగా దాతలు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవికు బంగారు గొలుసును అందజేయగా, దేవస్థానం తరపున అధికారిక రసీదు జారీ చేసి విరాళాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భక్తుల సేవాభావాన్ని దేవస్థానం అధికారులు అభినందించారు.

## మల్యాలలో విషాదం.. కుంటలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

**ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు**

**బాధిత కుటుంబాలకు సాయం ప్రకటించిన మంత్రి**



మల్యాల, ఆగస్టు 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు కుంటలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, సహ విద్యార్థులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం ప్రకారం, మధ్యాహ్నం టాయిలెట్‌కు వెళ్తున్నామని చెప్పి పాఠశాల నుంచి బయటకు వచ్చిన ఇద్దరు విద్యార్థులు హాస్టల్ సమీపంలోని కుంటలో ఈతకు దిగారు. ఈ క్రమంలో నీటిలో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికుల సహాయంతో గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మృతులను జగిత్యాల జిల్లా టీఆర్ నగర్‌కు చెందిన జగన్నాథ సుశాంత్ (10), నాలుగో తరగతి విద్యార్థి, అలాగే నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ గ్రామానికి చెందిన వనం విష్ణు (11), ఐదో తరగతి విద్యార్థిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**మృతుల కుటుంబాలకు 50 లక్షల పరిహారం ఇవ్వాలి: సుంకె**

ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. ప్రమాదకరమైన కుంట వద్ద కంచె, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, హాస్టళ్లలో పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ విషాదం జరిగిందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లు, గురుకులాల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: అడ్లూరి**

ఘటనపై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి అత్యంత బాధాకరమని పేర్కొంటూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.




## పీఆర్సీ.. డీఏల కోసం ఐక్య ఉద్యమం

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం**

**ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం**

జగిత్యాల, ఆగస్టు 3 (ఈవార్తలు): జగిత్యాల: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బకాయిల సాధనకు ఐక్య ఉద్యమాలే మార్గమని ఎస్టీయూ జగిత్యాల జిల్లా శాఖ తృతీయ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, ప్రధాన కార్యదర్శి పాలేపు శివరామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను వారి బోధనా సబ్జెక్టులతో సంబంధం లేకుండా టెట్ పరీక్షకు హాజరయ్యేలా చేయడం అశాస్త్రీయమని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరారు. జీవో 317 బాధితులకు శాశ్వత పరిష్కారం, జేఎల్ పదోన్నతుల పునరుద్ధరణ, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యల సాధనకు రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీర్ణంచ రవీందర్, రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రవి, జిల్లా ఆర్థిక కార్యదర్శి మేకల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దూరదృష్టికి కాళేశ్వరం నిదర్శనం

**కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**



కోరుట్ల, ఆగస్టు 3 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి వరప్రదాయినిగా నిలిచి, తరతరాలకు చెరగని చిరునామాగా మిగులుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించి, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. ఎల్లంపల్లి నుంచి రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్ ద్వారా వరద కాలువలోకి సుమారు అర టీఎంసీ నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలతో పాటు వరద కాలువ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ చూపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలు రానున్న తరాలకు కూడా ఉపయోగపడతాయని సంజయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# బీజేపీకి దెబ్బ మీద దెబ్బ

## పక్షంలోపే వరుసగా రెండు ఓటములు.. మొన్నటికి మొన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

### తాజాగా బంకీపూర్‌లో పీకే గెలుపు

న్యూఢిల్లీ: బీజేపీకి వరుసగా రెండో వారం కూడా భారీ ఎదురుదెబ్బ తగిలింది. నీట్ యూజీ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనలతో గతవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయగా.. తాజాగా, ఈ వారం రెండు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పరాజయాలతో ప్రారంభమైంది. బీజేపీ అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లోని జరిగిన ఉప-ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి చవిచూసింది. బిహార్‌లో పార్టీ అధినేత నితిన్ నబిన్ రాజీనామా చేసిన బంకీపూర్‌తో పాటు మధ్యప్రదేశ్‌లోని దతియా స్థానాలను కోల్పోయింది. సాధారణంగా ఉప ఎన్నికల్లో అధికార పార్టీలకు విజయావకాశాలు ఉంటాయి. సరిగ్గా గుజరాత్‌లోని మంజల్‌పూర్ అసెంబ్లీ స్థానంలో ఇదే జరిగింది. ఆ స్థానాన్ని బీజేపీ భారీ మెజారిటీతో గెలుచుకుంది. ఈ నేపథ్యంలో చూస్తే బంకిపూర్, దతియాలో ఎదురైన ఓటములు మాత్రం ఆ పార్టీని తీవ్రంగా కలవరపెడుతోంది. ముఖ్యంగా బంకిపూర్‌లో ఓటమి మరీ దారుణం. గత ఎన్నికల్లో బీజేపీ 50,000 ఓట్లకు పైగా మెజారిటీతో ఈ స్థానాన్ని చేజిక్కించుకుంది. అప్పుడు 64 శాతం ఓట్లు రాగా.. ప్రస్తుతం 34 శాతానికి పడిపోయింది. ఈ ఓటమిని సమీక్షించుకుంటామని బీజేపీ నాయకులు తెలిపారు. జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ మెజారిటీపై బూత్‌ల వారీగా విశ్లేషణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. బంకీపూర్ నియోజకవర్గంలో పీకే గెలుపుతో జన్ సూరజ్ పార్టీ బోణీ కొట్టి శాసనసభలో ప్రాతినిధ్యం దక్కించుకుంది. అయితే, ఆర్జేడీ తమ ఓట్లను ప్రశాంత్ కిషోర్‌కు బదిలీ చేసినట్లు బీజేపీ ప్రాథమిక అంచనా వేస్తోంది. ఆ పార్టీ అధినేత తేజస్వి యాదవ్ కేవలం ఒక గంట మాత్రమే ప్రచారం చేశారని గుర్తుచేస్తోంది. ఒక నాయకుడి ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ తన ప్రధాన ఓటు బ్యాంకును నిలబెట్టుకున్నప్పటికీ.. బీజేపీకి చెందిన అగ్రవర్ణ ఓటు బ్యాంకులోకి విస్తరించేందుకు ప్రశాంత్ కిషోర్‌కు వ్యూహాత్మకంగా మద్దతు ఇచ్చింది. గత ఎన్నికల్లో ఆర్జేడీకి చెందిన రేఖా గుప్తా 46,000కు పైగా ఓట్లు సాధించారు. ఈసారి, ఆమె 15,000 ఓట్లను కూడా పొందలేకపోయారు. బీజేపీ ఓటు బ్యాంకు సుమారు మూడింట ఒక వంతు తగ్గింది. పార్టీ ప్రధాన ఓటు బ్యాంకులో కొంత భాగం దూరమైందని, దీనిని సమీక్షిస్తామని పార్టీ నాయకులు అంగీకరించారు. ప్రశాంత్ కిషోర్ ఆరోపిస్తున్నట్లు ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని కూడా వారు



వ్యాఖ్యానించారు. అలాగే, అభ్యర్థిని మార్చాలనే నిర్ణయం కూడా పార్టీ విజయావకాశాలను దెబ్బతీసిందని, దీని ద్వారా బీజేపీ తన ఓటర్లను నిర్లక్ష్యం చేస్తుందనే సందేశం ప్రజల్లోకి వెళ్లిందని వర్గాలు పేర్కొన్నాయి. బంకీపూర్ నియోజకవర్గంలో ప్రచార బాధ్యతలను స్థానిక నాయకత్వానికి పార్టీ అప్పగించింది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ సొంత నియోజకవర్గం కావడంతో ఆయన నాలుగు సార్లు ఇక్కడ పర్యటించారు. అయితే నీట్ పేపర్ లీక్ నిరసనలు, యూజీసీ మార్గదర్శకాలు, భరత్ తివారీ ఎన్‌కౌంటర్ వంటి అంశాలపై ఓటర్లు అసంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని బీజేపీ నాయకులు తోసిపుచ్చడం లేదు. ఇది పోలింగ్ శాతంలో స్పష్టంగా కనిపించింది. బీహార్‌లో ఆందోళన చేస్తోన్న విద్యార్థులపై పోలీసుల చర్యలు కూడా పార్టీకి నష్టం కలిగించాయి.

# యుద్ధం వద్దన్న సౌదీ

**యువరాజు అభ్యర్థనతో ఇరాన్‌పై దాడికి ట్రంప్ బ్రేక్**

టెహ్రాన్: ఇరాన్‌పై మరిన్ని దాడుల చేపట్టవద్దని, తక్షణమే యుద్ధం నుంచి వైదొలగాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ కోరినట్టు అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌పై ఇటీవల అమెరికా- ఇజ్రాయెల్ దాడుల పరిణామాలు మొహమ్మద్ బిన్ డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన విజన్ 2030 ఆర్థిక ప్రణాళికకు సవాళ్లు విసిరాయి. అమెరికా అధ్యక్షుడితో శనివారం ఫోన్ కాల్‌లో మాట్లాడిన సౌదీ యువరాజు .. ఇరాన్ లక్ష్యాలపై దాడుల కోసం ట్రంప్ సిద్ధం చేసిన ప్రణాళికపై ఆందోళన వ్యక్తం చేశారు. జోర్డాన్‌లోని తమ సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడి, హర్మూజ్ జల సంధిలో నౌకల రాకపోకలకు అంతరాయం కలిగించడంతో టెహ్రాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేయాలని డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నట్టు ఆక్సియోస్ సంస్థ నివేదించింది.

# స్కాలర్‌షిప్, లోన్‌తో చదువుకున్నా

**అమెరికా చదువుపై అభిజిత్ దీప్కే వివరణ**

ముంబై: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కుటుంబ ఆర్థిక స్థితిపై విచారణ జరపాలని ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు చేసిన ఒక్క రోజులోనే అభిజిత్ ఈ విషయంపై స్పందించారు. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో తన ఉన్నత చదువుకు స్కాలర్‌షిప్, ఎడ్యుకేషన్ లోన్ మాత్రమే ఆధారం అని ఆయన స్పష్టం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ బర్ఖా దత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన విదేశీ చదువు వెనుక కుటుంబానికి లెక్కల్లో చూపని ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. "నా చదువుకు బోస్టన్ యూనివర్సిటీ ఇచ్చిన స్కాలర్‌షిప్ సాయపడింది. కొంత ఎడ్యుకేషన్ లోన్ కూడా తీసుకున్నా. దాన్ని ఇప్పుడు తిరిగి చెల్లించాల్సి ఉంది" అని చెబుతూ తన స్కాలర్‌షిప్ లెటర్‌ను చూపించారు. సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ, ఆగస్టు 1న మహారాష్ట్ర ప్రభుత్వం సహా పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీప్కే తండ్రి, మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడీసీ)లో రిటైర్డ్ జూనియర్ ఇంజనీర్‌గా నెలకు రూ. 60,000-65,000 జీతంతో తన పిల్లలను అమెరికాకు ఎలా పంపగలరని ప్రశ్నించారు. భవిష్యత్తులో పార్టీ కార్యకలాపాలకు నిధుల గురించి కూడా దీప్కే మాట్లాడారు. "సీజేపీ ముందు ముందు క్రౌడ్ ఫండింగ్ చేస్తుంది. ప్రజల నుంచి డబ్బు అడుగుతాం, ఈ విషయంలో చాలా పారదర్శకంగా ఉంటాం" అని తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యతిరేక ఆందోళనల సమయంలో కొందరు ఢిల్లీ పోలీసులు కూడా తమకు రహస్యంగా మద్దతు తెలిపి వాటర్ బాటిళ్లు అందించారని తెలిపారు.

# ప్రజల్లో భయం పోగొట్టడమే మా విజయం

**వాలంటీర్లతో సమీక్ష తర్వాత భవిష్యత్ కార్యాచరణ**

**కాక్రోచ్ పార్టీపై స్పష్టతనిచ్చిన అభిజిత్ దీప్కే**

న్యూఢిల్లీ: ఢిల్లీ విద్యార్థుల ఆందోళన తర్వాత తమ తొలి లక్ష్యం సంస్థను మరింత బలోపేతం చేయడమేనని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే చెప్పారు. ఉద్యమం ఆరంభంలో తమతో 10 నుంచి 20 మంది మాత్రమే ఉన్నారని, ఇప్పుడు వాలంటీర్ల సంఖ్య 300 దాటిందని తెలిపారు. ముందుగా వారందరితో సమావేశమై ఉద్యమంలో జరిగిన లోపాలు, మెరుగుపర్చాల్సిన అంశాలపై అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. ఆ తర్వాతే సంస్థ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే తమ ఉద్యమం అతిపెద్ద విజయం కాదని దీప్కే స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో పెరగడం, తమ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చి పోరాడే స్ఫూర్తి రావడమే నిజమైన విజయమని అన్నారు. గత 10 నుంచి 12 ఏళ్లుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పోలీసు చర్యలు, కేసులు, జైలు భయం ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపిస్తే ప్రభుత్వం స్పందించాలని దీప్కే అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని కోరినప్పుడు ఆ డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎన్నికల రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడినప్పుడు ప్రజా ఒత్తిడి తీసుకొచ్చే ఉద్యమాలే అవసరమని చెప్పారు. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలంలో కూడా ప్రజా ఉద్యమాలే కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు.

# నెల గరిష్ఠానికి రూపాయి

**రూ. 95.13కి చేరిన భారత కరెన్సీ**

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా తగ్గడంతో సోమవారం నాడు డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ పుంజుకుంది. దాదాపు నెల రోజుల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ట్రేడింగ్‌లో రూపాయి విలువ 0.3 శాతం బలపడి 95.13 వద్ద నిలిచింది. గత సెషన్‌లో ఇది 95.38 వద్ద ముగియగా, గత వారం రోజుల్లోనే రూపాయి విలువ 1 శాతానికి పైగా పెరగడం గమనార్హం. ఇరాన్‌తో ఘర్షణను ముగించేందుకు ఒక ఒప్పందం కుదరవచ్చన్న ఆశలతో ముడి చమురు ధరలు 7 శాతం వరకు పడిపోయాయి. ఇరాన్‌పై కొత్తగా దాడులు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విముఖత చూపడంతో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ధర సుమారు 5 శాతం తగ్గి బ్యారెల్‌కు 83.5 డాలర్లకు చేరింది. అదేవిధంగా యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ధర 7 శాతం క్షీణించి 79 డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. దీనికి తోడు భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరగడం కూడా రూపాయికి బలాన్నిచ్చింది.

# 'మేల్కొన్న హిందువు'గా మారా: కంగనా

సిమ్లా: తాను ఒకప్పుడు 'మోడరేట్ హిందువు'నని, ఇప్పుడు 'మేల్కొన్న హిందువు'గా మారానని బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ వ్యాఖ్యానించారు. ఇటీవల తన పాత వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. హిందుత్వంపై తన ఆలోచనల్లో వచ్చిన మార్పును వివరిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను పంచుకున్నారు. పార్లమెంట్‌కు వెళ్లే ముందు తన మనసులోని భావాలను పంచుకోవాలనిపించిందని కంగనా రనౌత్ వీడియోలో చెప్పారు. సినీ పరిశ్రమలో చాలా మంది హిందూ మహిళలు రాజకీయాలు, మతం వంటి అంశాలపై స్పష్టమైన భావజాలం లేకుండా తటస్థంగా ఉంటారని అన్నారు. యువతలో ఇలాంటి ధోరణి సాధారణమేనని వ్యాఖ్యానించారు. అయితే కొందరు ఇస్లామిస్టులతో పరిచయం పెరిగిన తర్వాత వారి ఆలోచనలు మారి వామపక్ష భావజాలం వైపు వెళ్తారని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన మతాన్ని, భావజాలాన్ని ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చిందని కంగనా అన్నారు. అదే స్వేచ్ఛ హిందూ మహిళలకు కూడా ఉండాలని పేర్కొన్నారు. తాను గతంలో 'మోడరేట్ హిందువు'గా ఉండేదాన్నని, ఇప్పుడు మాత్రం 'మేల్కొన్న హిందువు'గా మారాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లా క్రమశిక్షణతో కూడిన హిందుత్వ భావజాలాన్ని స్వీకరించాలనుకుంటున్నానని వెల్లడించారు.

# కర్ణాటక కాంగ్రెస్‌లో అసమ్మతి

**కేబినెట్ విస్తరణపై పలువరి పెదవి విరుపు**

**రాజీనామా చేస్తామని పదవులు దక్కని ఎమ్మెల్యేల హెచ్చరికలు**

**ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం**



బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు. సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు. వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే నేడు సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది.

# 25,000కు పీఎఫ్ వేతన పరిమితి

## కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం!

న్యూఢిల్లీ: దేశంలోని కోట్ల మంది ప్రైవేట్, సంఘటిత రంగ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అత్యంత తీపి కబురు అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ కింద తప్పనిసరి పీఎఫ్ కవరేజ్ కోసం నిర్దేశించిన వేతన పరిమితిని నెలకు రూ. 15000 నుంచి ఏకంగా రూ. 25000లకు పెంచే ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మనీకంట్రోల్ ఓ కథనం ప్రచురించింది. దీని వల్ల లక్షలాది మంది అదనపు ఉద్యోగులు ఈపీఎఫ్ఓ సామాజిక భద్రతా పథకాల పరిధిలోకి రానుండడమే కాకుండా, ఉద్యోగుల పదవీ విరమణ నిధి మరింత పెరగనుంది. దశాబ్ద కాలంగా రిటైర్మెంట్ ఫండ్ కవరేజీ వేతన పరిమితిని పెంచలేదు. చివరి సారిగా 2014లో పీఎఫ్ వేజ్ సీలింగ్‌ను రూ. 6500 నుంచి రూ. 15000లకు పెంచారు. తాజాగా ఈ వేతన పరిమితిని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ. 15000 నుంచి రూ. 25000లకు పెంచినట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ మనీకంట్రోల్ కథనం పేర్కొంది. ఈ పరిమితి ఒకసారి అమలులోకి వస్తే లక్షల మంది ఉద్యోగులు అదనంగా తప్పనిసరి ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ కవరేజీ పరిధిలోకి వస్తారు. అయితే, ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన తర్వాత ఏ తేదీ నుంచి అమలు చేస్తారు అనే విషయంపై క్లారిటీ రానుంది.

# వడ్డీరేట్లు యథాతథం!?

**ఆర్బీఐ ఎంపీసీ భేటీ షురూ**

న్యూఢిల్లీ: దేశంలోని కోట్లాది మంది రుణ గ్రహీతలకు శుభవార్త. బ్యాంకుల్లో తీసుకునే వివిధ రుణాల వడ్డీ రేట్ల పెంపు ఇప్పట్లో లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. రుణ గ్రహీతలు, బ్యాంకింగ్ రంగం, స్టాక్ మార్కెట్ వర్గాలు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన కమిటీ సమీక్ష మూడు రోజుల సమావేశాలు ఆగస్టు 3వ తేదీన ప్రారంభమయ్యాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణంపై సమగ్రంగా చర్చించనుంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, రిటైల్ ద్రవ్యోల్బణ సవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఈసారి కూడా ఆర్బీఐ రెపో రేటును యథాతథంగా కొనసాగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. అదే జరిగితే రుణాలు తీసుకున్న వారికి మరికొన్నాళ్ల పాటు ఊరట లభించనుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేసేందుకు జూన్ 2026 నెలలో జరిగిన ఎంపీసీ సమావేశంలో వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. రెపో రేటును 5.25 శాతం వద్దే స్థిరంగా కొనసాగిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు వచ్చిన క్రమంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను సవరించింది.

# తప్పుకున్న భయ్యాజీ జోషి

**అయోధ్య ట్రస్ట్ బాధ్యతలకు గుడ్‌బై.. అనారోగ్య కారణాలు చూపిన ఆరెస్సెస్ సీనియర్ నేత**

అయోధ్య: అయోధ్య రామ మందిర నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత సురేశ్ భయ్యాజీ జోషి ట్రస్ట్ సంరక్షకుడి బాధ్యతల నుంచి వైదొలగారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, నిధుల మళ్లింపు ఆరోపణలపై వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, తాను అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు 78 ఏళ్ల జోషి స్పష్టం చేశారు. 2026 జూన్ లో వెలుగులోకి వచ్చిన విరాళాల అక్రమాల ఆరోపణలతో ట్రస్ట్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నగదు కానుకల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి దాదాపు రూ. 80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. భయ్యాజీ జోషి 2009 నుంచి 2021 వరకు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. గతంలో రామజన్మభూమికి సంబంధించిన భూముల కొనుగోళ్లలో అవకతవకల ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన్ను ట్రస్ట్ పాట్రన్‌గా నియమించారు. ఆయన పాత్ర ప్రధానంగా తెరవెనుక సలహాలకే పరిమితమైంది.

# యూపీఐ చెల్లింపులకు అదనపు నిర్ధారణ

న్యూఢిల్లీ: యూపీఐ చెల్లింపుల్లో త్వరలో కొత్త భద్రతా విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. డిజిటల్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అనుమానాస్పద లావాదేవీలకు అదనపు నిర్ధారణ విధానాన్ని తీసుకురావాలని బ్యాంకులు భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కు (ఆర్బీఐ) ప్రతిపాదించాయి. దీనికి ఆమోదం లభిస్తే ప్రమాద సూచనలు ఉన్న కొన్ని యూపీఐ చెల్లింపులు ఒక్క క్లిక్‌తో పూర్తికావు. వినియోగదారుడి నుంచి మరోసారి స్పష్టమైన అంగీకారం తీసుకున్న తర్వాతే లావాదేవీ పూర్తవుతుంది. బ్యాంకుల ప్రతిపాదన ప్రకారం.. మోసాల గుర్తింపు వ్యవస్థ ఏదైనా లావాదేవీని అనుమానాస్పదంగా గుర్తిస్తే వినియోగదారుడి స్క్రీన్‌పై 'యెస్/నో' నిర్ధారణ సందేశం కనిపిస్తుంది. వినియోగదారుడు 'యెస్' ఎంచుకున్న తర్వాతే చెల్లింపు పూర్తవుతుంది. సాధారణ యూపీఐ లావాదేవీలకు ఈ అదనపు దశ ఉండదు. ప్రమాద సూచనలు కనిపించిన సందర్భాల్లో మాత్రమే ఇది అమల్లోకి వస్తుంది.






# కియారాపై ట్రోలింగ్



పాన్ ఇండియా స్టార్ యశ్ హీరోగా నటిస్తోన్న 'టాక్సిక్' చిత్రానికి సంబంధించి సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తోన్న సంగతి తెలిసిందే. సినిమాలోని ఇంటిమేట్ సన్నివేశాల నేపథ్యంలో కియారా అద్వానీపై సోషల్ మీడియా వేదికగా కొందరు నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సినిమాలోని పాత్రల డిమాండ్ మేరకు నటించే నటులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం దురదృష్ట కరమని విశ్లేషకులు భావిస్తున్నారు. తాజాగా ఈ పరిణామాలపై హ్యూమా ఖురేషి ట్రోలర్స్ తీరును తీవ్రంగా ఖండించారు. నటీనటులు కేవలం దర్శకుడి దృష్టికి అనుగుణంగా కథ డిమాండ్ చేసిన మేరకు పాత్రకు పూర్తి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తారని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం కొందరు వ్యక్తులు మహిళా నటులను టార్గెట్ చేస్తూ దిగజారుడు కామెంట్లు చేయడం సిగ్గుచేటని హ్యూమా ఖురేషీ మండిపడ్డారు. కళా రంగంలో పనిచేస్తున్న మహిళలపై ఇలాంటి ఆన్‌లైన్ దాడులు పెరగడం సమాజంలో అనారోగ్యకరమైన ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం సంచలనం సృష్టించాలనే ఉద్దేశంతో కొందరు చేసే విమర్శలు నటుల వ్యక్తిగత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నెగెటివిటీని నటీనటులు ఎంతమాత్రం సహించకూడదని, అందరూ కలిసి దీనికి వ్యతిరేకంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు. సమకాలీన సినీ పరిశ్రమలో నటీమణులు తమకు నచ్చిన వైవిధ్యమైన పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ ఉందని అయితే దానిని తప్పుపట్టే సంస్కృతి మారాలని పలువురు సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. కియారా అద్వానీ లాంటి ప్రతిభావంతులైన నటీమణులపై వస్తోనర్ నిరాధారమైన విమర్శలను సినీ వర్గాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. వార్తల కోసం ఇలాంటి వివాదాలను సృష్టించడం మానుకోవాలని హితవు పలుకుతున్నారు.




# బలవంతపు సెలవు: రష్మిక



ప్రముఖ నటి రష్మిక మందన్న ఇటీవల తాను షూటింగ్ లో గాయపడడంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాను నటిస్తున్న 'మైసా' సినిమాలోని ఓ డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపారు. తన గాయం గురించి, విశ్రాంతి గురించి వివరిస్తూ సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "గాయాలు చాలా బాధిస్తాయి. ఈ విషయం ఎవరికీ తెలియకూడదని నేను నిజంగా ఆశించాను. కానీ, ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇన్ని రోజులు కనిపించనందుకు క్షమించండి. నేను మళ్ళీ వచ్చేశాను. ఇది జరిగి కొంతకాలం అయింది. వరుసగా ఇది నాకు మూడో గాయం. నా శరీరాన్ని యంత్రంలా కాకుండా, మనిషి శరీరంలా చూడటం నేను కచ్చితంగా నేర్చుకోవాలి" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన గాయం తీవ్రతను వివరిస్తూ, "ఈ గాయం గురించి ఎలా చెప్పాలంటే.. మన తుంటికి, కాలికి మధ్య నాలుగు టెండన్లు ఉంటాయి. వాటిలో నా కుడి వైపు ఉన్న ఒక టెండన్ తెగిపోయింది. అది మళ్లీ అతుక్కుంటేనే నేను కాలు పైకి ఎత్తగలను. 'మైసా' సినిమాలోని డ్యాన్స్ షూట్‌లో ఇది జరిగింది. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత అగ్రెసివ్ ఫిల్మ్ అని చెప్పొచ్చు. కానీ కంగారు పడకండి. నొప్పి ఉన్నా భరించలేనిది ఏమీ కాదు" అని ఆమె వివరించారు. ఈ గాయాన్ని దేవుడు తనకు బలవంతంగా ఇచ్చిన సెలవుగా భావిస్తున్నానని రష్మిక పేర్కొన్నారు. "నాకు నేనైతే ఎప్పుడూ బ్రేక్ తీసుకోను కాబట్టి, దేవుడే ఈ రూపంలో నాకు విశ్రాంతి ఇచ్చాడనిపిస్తోంది. నాకు తగిలిన ఈ గాయాలన్నీ యాదృచ్ఛికంగా జరిగినవే. ఇది బలవంతపు సెలవు అయినా, నేనేమీ బాధపడటం లేదు. ఈ సమయంలో చాలా పజిల్స్ పూర్తి చేస్తున్నా. వాటిలో నేను ఇంత బాగా ఆడతానని నాకు తెలియదు" అని ఆమె తెలిపారు. వర్కవుట్లు చేయలేకపోవడంపై తన ఆందోళనను కూడా పంచుకున్నారు.

# 25 ఏళ్లలో ఎన్నో మధుర జ్ఞాపకాలు

యాక్షన్ హీరో గోపీచంద్ చిత్ర పరిశ్రమలో 25 ఏళ్ల మైలురాయిని పూర్తి చేసుకున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని పురస్కరించుకుని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఒక భావోద్వేగపూరిత లేఖను పంచుకున్నారు. తన తండ్రి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ ప్రస్థానంలో తనకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. "నాన్నగారి ఆశీస్సులతో మొదలైన నా సినీ ప్రయాణానికి 25 ఏళ్లు" అంటూ గోపీచంద్ తన లేఖను ప్రారంభించారు. ఈ పాతికేళ్ల ప్రయాణంలో తనకు అవకాశాలిచ్చిన నిర్మాతలు, దర్శకులు, రచయితలు, సహ నటీనటులు మరియు సాంకేతిక నిపుణులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కెరీర్ ఆరంభం నుంచి నేటి వరకు తనకు అండగా నిలిచిన అభిమానులకు, మీడియా మిత్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల ప్రేక్షకులు, ప్రతి హీరో అభిమానులు తనపై చూపిన ఆదరణను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.




# ఒత్తిడి గొప్పగా తీర్చిదిద్దాయి



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, డ్యాన్స్ నేర్చుకోవాల్సిన పరిస్థితి ఎలా ఏర్పడిందో తమన్నా వివరించారు. చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఎలాంటి శిక్షణ లేకుండానే డ్యాన్స్‌ను ఒక సర్వైవల్ స్కిల్ గా మార్చుకున్నానని తెలిపారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. భారీ సెట్లు.. వందలాది మంది టెక్నీషియన్ల మధ్య ఎలాంటి ముందస్తు రిహార్సల్స్ లేకుండానే పాటల్లో నటించాల్సి వచ్చేదని తమన్నా పేర్కొన్నారు. అప్పట్లో భయపడటానికి సమయం లేదని, కేవలం నేర్చుకోవడానికి మాత్రమే అవకాశం ఉండేదని వెల్లడించారు. ఆ నాటి కఠినమైన షెడ్యూల్స్ .. నిరంతర ఒత్తిడే తనను అద్భుతమైన పెర్ఫార్మర్‌గా తీర్చిదిద్దాయని అభిప్రాయపడ్డారు. నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్' లోని 'ఘఫూర్' పాట షూటింగ్ సమయంలోనూ ఇలాంటి సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు.



# 3 నెలల్లోనే 25 కిలోలు తగ్గింది!

డెలివరీ తర్వాత బరువు తగ్గడం చాలా మంది మహిళలకు పెద్ద సవాల్‌గా మారుతుంది. ముఖ్యంగా ట్విన్స్ కు జన్మనిచ్చిన తర్వాత శారీరకంగా కోలుకోవడం, పిల్లల సంరక్షణ, నిద్రలేమి వంటి కారణాలతో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అంత ఈజీ కాదు. అయితే కన్నడ టెలివిజన్ నటి ఐశ్వర్య సలీమత్ తన పోస్ట్ డెలివరీ ఫిట్‌నెస్ జర్నీతో ఇప్పుడు చర్చనీయాంశంగా మారారు. కేవలం మూడు నెలల్లోనే 90 కిలోల నుంచి 65 కిలోలకు చేరుకున్నట్లు ఆమె వెల్లడించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అగ్నిసాక్షి, రామాచారి, సేవంతి, సరయూ వంటి సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందిన ఐశ్వర్య ప్రస్తుతం యాక్టింగ్ కు గ్యాప్ ఇచ్చి తన కవల పిల్లల సంరక్షణలో బిజీగా ఉన్నారు. గతేడాది డిసెంబర్‌లో ఐశ్వర్య, యాక్టర్ వినయ్ దంపతులకు కవలలు జన్మించారు. పిల్లల ఆరోగ్యంతో పాటు తన ఆరోగ్యాన్ని కూడా బ్యాలెన్స్ చేసుకోవాలనే ఆలోచనతో లైఫ్ స్టైల్ లో మార్పులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. బరువు తగ్గడానికి ఎలాంటి క్రాష్ డైట్‌ను ఫాలో అవలేదని, ఆహారపు అలవాట్లలో క్రమబద్ధమైన మార్పులే ప్రధాన కారణమని ఐశ్వర్య చెప్పడం విశేషం.



# అమెరికా క్రికెటర్ అఖిలేశ్ రెడ్డిపై నిషేధం

అంతర్జాతీయ క్రికెట్‌లో మరో అవినీతి ఉదంతం కలకలం రేపింది. అమెరికా (యూఎస్ఏ) క్రికెటర్ బొడుగం అఖిలేశ్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎనిమిదేళ్ల పాటు నిషేధం విధించింది. 2025లో జరిగిన అబుదాబి టీ10 లీగ్‌లో అఖిలేశ్ రెడ్డి అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో ఐసీసీ ఈ కఠిన చర్యలు తీసుకుంది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఐసీసీ వెల్లడించింది. ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రైబ్యునల్ విచారణలో అఖిలేశ్ రెడ్డిపై మూడు ప్రధాన ఆరోపణలు రుజువయ్యాయి. టీ10 లీగ్‌లో మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం, సహచర ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరడం, విచారణను అడ్డుకునే ఉద్దేశంతో తన ఫోన్‌లోని వాట్సాప్ సందేశాలు, కాల్ లాగ్‌లను డిలీట్ చేయడం వంటి నేరాలకు పాల్పడినట్లు ట్రైబ్యునల్ నిర్ధారించింది. 2025 నవంబర్ 19న అస్పిన్ స్టాలియన్స్ జట్టు తమ తొలి మ్యాచ్ ఆడటానికి ముందురోజు, అఖిలేశ్ రెడ్డి హోటల్ గదిలో తన సహచర బౌలర్‌ను కలిసి, ఎక్కువ పరుగులు ఇవ్వాలని కోరాడు. టీమ్ మేనేజ్‌మెంట్ సూచన మేరకే తాను ఇలా అడుగుతున్నట్లు అతడిని నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే, సదరు ఆటగాడు ఇందుకు నిరాకరించి, ఈ విషయాన్ని వెంటనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ దృష్టికి తీసుకెళ్లాడు. విచారణలో భాగంగా ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడంపై అఖిలేశ్ ఇచ్చిన వివరణలను ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. 26 ఏళ్ల అఖిలేశ్ రెడ్డి అమెరికా తరఫున ఇప్పటివరకు నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

# జమ్మూకశ్మీర్ పేసర్ అకీబ్ నబీకి పిలుపు

దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆల్‌రౌండర్ అకీబ్ నబీకి భారత టెస్టు జట్టులో తొలి అవకాశం లభించింది. శ్రీలంకతో సిరీస్‌కు గాయంతో జస్‌ప్రీత్ బుమ్రా దూరం కావడంతో అతడి స్థానంలో సెలెక్టర్లు నబీని ఎంపిక చేశారు. దీంతో భారత పురుషుల టెస్టు జట్టుకు ఎంపికైన తొలి జమ్మూకశ్మీర్ క్రికెటర్‌గా అకీబ్ నబీ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. బుమ్రా ఎడమ మోకాలి గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో సిరీస్‌కు దూరమవ్వాల్సి వచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడిన బుమ్రా ఫిట్‌నెస్ సాధిస్తేనే జట్టులో కొనసాగుతాడని ముందే బీసీసీఐ ప్రకటించింది. అయితే పూర్తిగా కోలుకోకపోవడంతో అతణ్ని తప్పించి అకీబ్ నబీకి అవకాశం కల్పించింది. 29 ఏళ్ల కుడిచేతి ఫాస్ట్‌బౌలింగ్ ఆల్‌రౌండర్ అకీబ్ నబీ దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ఫామ్‌తో ఈ అవకాశాన్ని అందుకున్నాడు. గత రంజీ ట్రోఫీ సీజన్‌లో ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్‌కు తొలి టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. గత రెండు రంజీ సీజన్లలో కలిపి 104 వికెట్లు సాధించి తన స్థిరమైన ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. అదే ఫామ్ ఇప్పుడు జాతీయ జట్టులో చోటు కల్పించింది. దేశవాళీ ప్రదర్శన ఆధారంగా ఐపీఎల్-2026లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కూడా నబీకి అవకాశం దక్కింది. ఐదు మ్యాచ్‌లు ఆడినా వికెట్లు మాత్రం సాధించలేకపోయాడు. ఇటీవల శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇండియా-ఏ జట్టులో చోటు దక్కించుకున్న అతడు ఆరు వికెట్లు తీశాడు. ఆ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. అంతకుముందు ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు నెట్ బౌలర్‌గా భారత జట్టుతో ఉన్న అనుభవం కూడా అతడికి ఉంది. అకీబ్ నబీ ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో దులీప్ ట్రోఫీ కోసం సాధన చేస్తున్నాడు. ఇప్పుడు అక్కడి నుంచి ముంబై చేరుకుని భారత జట్టుతో కలవనున్నాడు. ఆ తర్వాత జట్టు కొలంబోకు బయలుదేరుతుంది. ఆగస్టు 7 నుంచి 9 వరకు మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడిన తర్వాత గాలేలో జరిగే తొలి టెస్టులో బరిలోకి దిగుతుంది. తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరుగుతుంది. ఈ సిరీస్‌లో మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్‌తో కలిసి నబీ భారత పేస్ దళంలో భాగం కానున్నాడు.





# కశ్మీరీ ఎంఎంఏ ఫైటర్ సత్తా


## ప్రపంచ ఛాంపియన్ అయిన ఫైటర్‌ను ఓడించిన ఓవైస్ యాకూబ్

**అంతర్జాతీయ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) యవనికపై ఓ భారతీయ యువకుడు సంచలనం సృష్టించాడు. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఓవైస్ యాకూబ్, బల్గేరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక బ్రేవ్ సీఎఫ్ 107 ఈవెంట్‌లో అద్భుత విజయాన్ని నమోదు చేశాడు.**

**ఇప్పటివరకు ఓటమి ఎరుగని, రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన బల్గేరియా ఫైటర్ డెల్యన్ జార్జివ్‌ను మట్టికరిపించి చరిత్ర సృష్టించాడు. ఈ విజయం పట్ల జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేస్తూ ఓవైస్‌కు అభినందనలు తెలిపారు.**

ఒమర్ అబ్దుల్లా కార్యాలయం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. "బల్గేరియాలో అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి అద్భుత విజయం సాధించిన జమ్మూ కశ్మీర్ ఎంఎంఏ ఫైటర్ ఓవైస్ యాకూబ్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇది జమ్మూ కశ్మీర్‌తో పాటు దేశానికే గర్వకారణం. భవిష్యత్తులోనూ అతను మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ వేదికపై దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు" అని పేర్కొంది. ఆగస్టు 1న బల్గేరియాలోని బుర్గాస్ ఎరీనాలో జరిగిన ఈ పోరులో ఓవైస్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మొదటి రౌండ్ ప్రారంభమైన కేవలం 4 నిమిషాల్లోనే టెక్నికల్ నాకౌట్ (టీకేఓ) ద్వారా డెల్యన్ జార్జివ్‌ను ఓడించి తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. ఈ ఓటమితో జార్జివ్ కెరీర్‌లో తొలి పరాజయం నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా మురాన్ గ్రామానికి చెందిన ఓవైస్, ఈ పోరులో అద్భుతమైన నిలకడ, పట్టుదల, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు. విజయం అనంతరం ఓవైస్ యాకూబ్ మాట్లాడుతూ.. "ఈ విజయం నాకు సర్వస్వం. నా కుటుంబం, జమ్మూ కాశ్మీర్ ప్రజలు, యావత్ దేశం ఆశలను మోస్తూ నేను బరిలోకి దిగాను. అజేయ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించడం ఒక కల నిజమైన క్షణం. అయితే ఇది ఆరంభం మాత్రమే. మరింత కష్టపడి పనిచేసి, ప్రపంచ వేదికపై గర్వంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మరిన్ని విజయాలు సాధిస్తాను" అని అన్నాడు. గతంలో కశ్మీర్ నుంచి పలువురు రెజ్లర్లు జాతీయ స్థాయిలో రాణించినప్పటికీ, ఎంఎంఏ క్రీడలో ఓవైస్ సాధించినటువంటి అంతర్జాతీయ మైలురాయిని ఇంతవరకు ఎవరూ చేరుకోలేదు.

# ఆసీస్ జట్టులో భారత సంతతి సంచలనం నీల్ పటేల్



భారత అండర్-19 జట్టుతో తలపడేందుకు ఆస్ట్రేలియా తమ 16 మంది సభ్యులతో కూడిన అండర్-19 జట్టును ప్రకటించింది. వచ్చే నెలలో జరగనున్న ఈ పర్యటనలో భారత సంతతికి చెందిన యువ సంచలనం నీల్ పటేల్‌కు చోటు దక్కడం విశేషం. ఈ టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు టీమిండియా అండర్-19తో రాజ్‌కోట్, అహ్మదాబాద్ వేదికలుగా మూడు 50 ఓవర్ల మ్యాచ్‌లు, రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడనుంది. ఫాస్ట్ బౌలర్లు విల్ బైరమ్, కాసే బార్టన్‌లు ఈ జట్టు పేస్ దళాన్ని నడిపించనున్నారు. ఈ పర్యటనలో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఆటగాడు నీల్ పటేల్. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (యూఎన్ఎస్‌డబ్ల్యూ) క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నీల్, కేవలం 16 ఏళ్ల వయసులోనే సిడ్నీ ప్రీమియర్ క్రికెట్ ఫస్ట్ గ్రేడ్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 1000కి పైగా పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. ఇంత చిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన అతికొద్ది మంది ఆటగాళ్లలో ఒకడిగా నిలిచి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఇప్పుడు భారత గడ్డపై తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. జట్టులోని ఇతర ముఖ్య ఆటగాళ్లలో విల్ బైరమ్, కాసే బార్టన్‌లు ఉన్నారు. ఈ ఏడాది జింబాబ్వేలో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించినది వీరిద్దరే కావడం గమనార్హం. ఆ టోర్నీలో 17 ఏళ్ల బైరమ్ కేవలం 10.50 సగటుతో 10 వికెట్లు పడగొట్టి అద్భుతంగా రాణించాడు. బార్టన్ కూడా నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అయితే, ఆ ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా సెమీ-ఫైనల్‌లో ఇంగ్లండ్ చేతిలో 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. భారత పర్యటనపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) జాతీయ అభివృద్ధి విభాగం హెడ్ సోన్యా థాంప్సన్ మాట్లాడుతూ.. "ఆస్ట్రేలియాలోని అత్యుత్తమ యువ క్రికెటర్ల అభివృద్ధికి ఈ పర్యటన ఒక గొప్ప అవకాశం.

# భువీనే నం.1: అర్ష్‌దీప్



భారత యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, తన దృష్టిలో అత్యుత్తమ ఐదుగురు భారత బౌలర్ల జాబితాను ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ జాబితాలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు అగ్రస్థానం ఇవ్వగా, ప్రపంచంలోని మేటి బౌలర్లలో ఒకడిగా పేరున్న జస్ప్రీత్ బుమ్రాకు చోటు కల్పించకపోవడం చర్చనీయాంశమైంది. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అర్ష్‌దీప్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భువనేశ్వర్ కుమార్ తన వ్యక్తిగత ఫేవరెట్ అని, అందుకే అతడికి మొదటి స్థానం ఇచ్చానని అర్ష్‌దీప్ స్పష్టం చేశాడు. కొత్త బంతితో అతడి నియంత్రణ అద్భుతంగా ఉంటుందని ప్రశంసించాడు. "భువీ భాయ్ నా ఫేవరెట్ కాబట్టి అతడికే అగ్రస్థానం. ఈ విషయంలో నేను కొంచెం పక్షపాతంతో ఉన్నాను" అని నవ్వుతూ చెప్పాడు. ఈ జాబితాలో రెండో స్థానంలో మహమ్మద్ షమీని ఎంచుకున్నాడు. ఏ వికెట్‌పైనైనా బంతిని సీమ్ చేయగల సత్తా షమీకి ఉందని, అతడి బౌలింగ్, సీమ్ ప్రెజెంటేషన్ అద్భుతంగా ఉంటుందని కితాబిచ్చాడు. ఆ తర్వాత స్పిన్నర్లకు ప్రాధాన్యత ఇచ్చాడు. అరుదైన నైపుణ్యం ఉన్న లెఫ్ట్ ఆర్మ్ చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌కు మూడో స్థానం కట్టబెట్టాడు. నాలుగో స్థానంలో యుజ్వేంద్ర చాహల్‌ను నిలిపాడు. చాహల్ తనకు పంజాబ్ జట్టు సహచరుడని, అతడి రికార్డు కూడా అద్భుతంగా ఉందని పేర్కొన్నాడు. ఇక, ఐదో స్థానంలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంచుకున్నాడు.

# బూతులు వద్దు: మనూభాకర్



ఒలింపిక్ షూటర్ మనూ భాకర్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ మెసేజ్ పోస్టు చేశారు. చెడు భాష గురించి ఆమె తన మెసేజ్‌లో యువతకు సందేశం ఇచ్చారు. చెడుగా మాట్లాడడం మానుకోవాలని ఆమె యువతను కోరారు. తిట్టుకోవడం, దుర్భాషలాడడం .. మంచి పద్ధతి కాదు అని ఆమె అన్నారు. మీరు మాట్లాడే మాటలే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన షూటర్ మనూ భాకర్.. తన ఎక్స్ అకౌంట్‌లో సుదీర్ఘ సందేశాన్ని పోస్టు చేశారు. మీ భాషే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తుందని, మీరెలాంటి వాళ్లో చెబుతోందని, మీ పదాలను తెలివిగా ఎంచుకోవాలని, ఎందుంటే మీరు అనుకున్నట్లే మీరు తయారు అవుతారన్నారు. చెడు భాషను వాడడం మంచి పద్ధతి కాదు అని, దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. అలా చేస్తే నిర్మలంగా ఉండలేరన్నారు. కూల్‌గా ఉండడం అంటే హార్డ్ వర్క్ చేయడమే అని, దయతో ఉండాలని, ఇతరుల పట్ల గౌరవాన్ని చూపాలన్నారు. మంచితనంతో విజయం సాధించాలన్నారు. మీ పేరెంట్స్, దేశాన్ని గర్వంగా నిలపాలన్నారు. ఈ విషయాన్ని మీకెందుకు చెబుతున్నానంటే, గత కొన్నేళ్ల నుంచి .. చెడు భాషను వాడుతున్న తీరు మారిందన్నారు. చాలా మంది చాలా సాదాసీదాగా చెడు మాటలు మాట్లాడుతున్నారని, దాన్నే కూల్‌గా భావిస్తున్నారని, రోజువారీ మాటల్లో అమర్యాదకర భాషను వాడుతున్నట్లు షూటర్ మనూ భాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తిట్టడం అంటే కూల్‌గా ఉండడం కాదన్నారు.

# అథ్లెట్లను ప్రశంసించలేదేం?

## రాహుల్ గాంధీని ప్రశ్నించిన బాక్సర్ విజేందర్ సింగ్

ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ బాక్సర్ విజేందర్ సింగ్.. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ రాహుల్ గాంధీ నుంచి కనీసం ఒక్క అభినందన సందేశం కూడా రాకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. క్రీడా విజయాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ మేరకు విజేందర్ సింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఒక పోస్ట్ చేశారు. "రాహుల్ గాంధీ జీ, కాంగ్రెస్ పార్టీ తరచూ దేశ యువత గురించి మాట్లాడుతుంది. కానీ కామన్వెల్త్ గేమ్స్‌లో మన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిస్తే మీ నుంచి ఒక్క అభినందన సందేశం కానీ, ట్వీట్ కానీ రాలేదు. దేశ యువత త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరేస్తున్నప్పుడు, మనం కూడా రాజకీయాలకు అతీతంగా వారి నైతిక స్థైర్యాన్ని పెంచడం మనందరి బాధ్యత" అని విజేందర్ తన పోస్టులో పేర్కొన్నాడు. గ్లాస్గోలో ముగిసిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తం 39 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు

మంగళవారం 4-8-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

# దిశానిర్దేశమే భారత భవితకు పునాది

భారత్ నేడు ప్రపంచంలో అత్యంత యువ జనాభా కలిగిన దేశం. సుమారు 65 శాతానికి పైగా జనాభా 35 ఏళ్లలోపే ఉండటం భారతదేశానికి లభించిన అతిపెద్ద శక్తి. ఈ యువతరం ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలు గత తరాల కంటే భిన్నంగా ఉన్నాయి. నేటి భారత యువత వేగాన్ని కోరుకుంటోంది. అవకాశాలను వెతకడం కాదు, అవకాశాలను సృష్టించాలని కోరుకుంటోంది. ప్రపంచంతో పోటీ పడేందుకు సిద్ధమవుతోంది. అందుకే రేపటి భారత్ దూకుడుతో కూడిన యువశక్తి చేతుల్లో రూపుదిద్దుకోబోతోంది. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగమే జీవిత లక్ష్యంగా భావించిన పరిస్థితి నేడు పూర్తిగా మారిపోయింది. నేటి యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంటోంది. స్టార్టప్‌లు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత, అంతరిక్ష పరిశోధనలు, బయోటెక్నాలజీ, ఫిన్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో భారత యువత ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న భారతీయులు, అంతర్జాతీయ పరిశోధనల్లో కీలక పాత్ర పోషిస్తున్న యువ శాస్త్రవేత్తలు, కోట్ల రూపాయల విలువైన సంస్థలను నిర్మిస్తున్న యువ పారిశ్రామికవేత్తలు దేశ భవిష్యత్తుపై విశ్వాసాన్ని పెంచుతున్నారు. ఈ దూకుడు కేవలం సాంకేతిక రంగానికే పరిమితం కాలేదు. క్రీడలు, కళలు, వ్యవసాయం, సామాజిక సేవ, రాజకీయాలు, పరిపాలన---ప్రతి రంగంలోనూ యువత తమదైన ముద్ర వేస్తోంది. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడం నుంచి ప్రపంచ చెస్ ఛాంపియన్లుగా ఎదగడం వరకు, గ్రామీణ ప్రాంతాల్లో వినూత్న వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టడం నుంచి డిజిటల్ వ్యాపారాలను నిర్మించడం వరకు యువత ప్రతిభ ప్రతి రోజూ కనిపిస్తోంది. అయితే దూకుడు ఒక్కటే సరిపోదు. దానికి సరైన దిశ, విలువలు, బాధ్యత కూడా తోడవ్వాలి. వేగం ఉన్న వాహనానికి బ్రేకులు ఎంత అవసరమో, యువతకు వివేకం అంత అవసరం. సోషల్ మీడియా ప్రభావం, తక్షణ విజయాలపై మోజు, తప్పుడు సమాచార వ్యాప్తి, మాదకద్రవ్యాల బారిన పడటం, మానసిక ఒత్తిడి వంటి సవాళ్లు కూడా ఇదే తరాన్ని వెంటాడుతున్నాయి. కాబట్టి యువశక్తిని సరైన మార్గంలో నడిపించడం కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. నేటి విద్యా వ్యవస్థ కూడా కాలానుగుణంగా మారాల్సిన అవసరం ఉంది. కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే విద్య కాకుండా, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార దృక్పథం పెంపొందించే విద్యను అందించాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపొందించాలి. ఉద్యోగాలు వెతికే యువతను మాత్రమే కాదు, కొత్త అవకాశాలు సృష్టించే యువ పారిశ్రామికవేత్తలను తయారు చేయాలి. ప్రభుత్వాల పాత్ర కూడా అత్యంత కీలకం. నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, ఆధునిక మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, పరిశోధనలకు నిధులు, పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థ ఉంటే యువత సామర్థ్యం మరింత వెలుగులోకి వస్తుంది. ప్రతిభకు రాజకీయాలు, ప్రాంతీయత, కుల, మత భేదాలు అడ్డుకాకూడదు. ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారానే భారత యువశక్తి ప్రపంచాన్ని నడిపించే స్థాయికి చేరుతుంది. రేపటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషించాలంటే యువత దూకుడును దేశాభివృద్ధి దిశగా మలచాలి. జనాభా ఎక్కువగా ఉండటం మాత్రమే డెమోగ్రాఫిక్ డివిడెండ్ కాదు. ఆ జనాభా నైపుణ్యం, క్రమశిక్షణ, సృజనాత్మకత, దేశభక్తితో ముందుకు సాగినప్పుడే అది నిజమైన శక్తిగా మారుతుంది. నేటి భారత యువతలో ఉన్న ఆత్మవిశ్వాసం, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు, ప్రపంచ దృష్టి, సాహసోపేతమైన నిర్ణయాలు రేపటి భారతాన్ని మరింత శక్తివంతమైన దేశంగా నిలబెట్టే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఈ దూకుడును అడ్డుకోవడం కాదు, దానికి సరైన దిశ చూపించడమే దేశం ముందున్న అతిపెద్ద బాధ్యత.

## నాగరికత మూలమే..

# భారత జీవన బలం





డాక్టర్ రక్కిరెడ్డి ఆది రెడ్డి
సహాయ ఆచార్యులు, జర్నలిజం , ప్రసార మాధ్యమాల శాఖ , పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల
కాకతీయ విశ్వవిద్యాలయం, హనుమకొండ

భారతదేశ చరిత్ర అనేది కేవలం రాజులు, యుద్ధాలు, రాజవంశాల చరిత్ర మాత్రమే కాదు. వేల సంవత్సరాలుగా పరిణామం చెందిన మానవ జీవన విధానాలు, సంస్కృతి, వ్యవసాయం, వాణిజ్యం, భాషలు, మతాలు, కళలు, శాస్త్రాల సమగ్ర గాథ. ప్రపంచంలోని అత్యంత ప్రాచీన నాగరికతలలో ఒకటైన భారతీయ నాగరికత, కాలానుగుణంగా మార్పులను స్వీకరిస్తూనే తన మూల విలువలను నిలబెట్టుకుంది. అదే భారత జీవన విధానానికి ఉన్న అసాధారణ బలం. భారతీయ నాగరికతకు నదులే ప్రాణాధారం. సింధు, గంగా, సరస్వతి, గోదావరి, కృష్ణ, కావేరి వంటి నదుల తీరాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందడంతో గ్రామాలు, పట్టణాలు, రాజ్యాలు ఆవిర్భవించాయి. క్రీ.పూ. 3300-1300 మధ్య వెలసిన సింధు లోయ నాగరికత ప్రపంచంలోనే అత్యంత ప్రణాళికాబద్ధమైన పట్టణ నాగరికతగా నిలిచింది. హరప్పా, మొహెంజోదారో, ధోలవీరా, లోథాల్ నగరాల్లో వీధులు, మురుగునీటి పారుదల, ధాన్యాగారాలు, ప్రజా స్నానగృహాలు, వాణిజ్య కేంద్రాలు ఉండటం అప్పటి భారతీయ సమాజం ఎంత అభివృద్ధి చెందిందో తెలియజేస్తుంది. సింధు నాగరికత అనంతరం వేదయుగం భారత జీవన విధానానికి కొత్త దిశను ఇచ్చింది. కుటుంబ వ్యవస్థ, వ్యవసాయం, పశుపోషణ, ప్రకృతి ఆరాధన, గురుకుల విద్యా విధానం ఈ కాలంలో బలపడ్డాయి. వేదాలు కేవలం ఆధ్యాత్మిక గ్రంథాలు మాత్రమే కాకుండా సమాజం, వైద్యం, సంగీతం, వ్యవసాయం, ప్రకృతి విజ్ఞానంపై విలువైన సమాచారాన్ని అందించాయి. విద్య వ్యక్తిత్వ వికాసానికి సాధనంగా భావించబడింది.

భారత సమాజంలో సంయుక్త కుటుంబ వ్యవస్థ అనేక శతాబ్దాల పాటు సామాజిక భద్రతకు మూలస్తంభంగా నిలిచింది. వ్యవసాయం జీవనాధారంగా అభివృద్ధి చెందగా, రైతులు, కమ్మర్లు, కుమ్మర్లు, వడ్రంగులు, నేతలు, స్వర్ణకారులు వంటి వృత్తులు పరస్పర ఆధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిర్మించాయి. ప్రకృతిని తల్లిగా భావించడం, చెట్లు, నదులు, పర్వతాలకు పవిత్రత కల్పించడం భారతీయుల పర్యావరణ దృక్పథానికి నిదర్శనం. భాషా వైవిధ్యం భారతదేశానికి ప్రత్యేకత. సంస్కృతం, తమిళం, పాళీ, ప్రాకృతం నుంచి తెలుగు, కన్నడ, మరాఠీ, బెంగాలీ, ఒడియా, మలయాళం, హిందీ వంటి భాషలు భారతీయ సాహిత్యాన్ని సమృద్ధి చేశాయి. అలాగే హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతాలు భారతదేశంలోనే ఆవిర్భవించగా, ఇస్లాం, క్రైస్తవం, జొరాస్ట్రియనిజం వంటి మతాలు కూడా ఇక్కడ స్థిరపడ్డాయి. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ నాగరికతకు గుర్తింపు. క్రీ.పూ. 6వ శతాబ్దంలో మహాజనపదాల ఆవిర్భావంతో పట్టణీకరణ, వాణిజ్యం, నాణేల వినియోగం విస్తరించాయి. ఇదే కాలంలో గౌతమ బుద్ధుడు, మహావీరుడు సమానత్వం, అహింస, నైతిక జీవనాన్ని బోధించి భారతీయ ఆలోచనా ప్రపంచాన్ని ప్రభావితం చేశారు. తక్షశిల, నాళంద వంటి విద్యా కేంద్రాలు ప్రపంచ నలుమూలల నుంచి విద్యార్థులను ఆకర్షించాయి.

మౌర్య సామ్రాజ్యం భారత రాజకీయ ఏకీకరణకు పునాది వేసింది. చంద్రగుప్త మౌర్యుడు విశాల సామ్రాజ్యాన్ని నిర్మించగా, కౌటిల్యుని అర్థశాస్త్రం పరిపాలన, ఆర్థిక వ్యవస్థపై అపూర్వ గ్రంథంగా నిలిచింది. కళింగ యుద్ధం అనంతరం అశోకుడు ధర్మపాలన, ప్రజా సంక్షేమం, మత సహనాన్ని ప్రోత్సహించాడు. చెట్లు నాటడం, బావులు తవ్వించడం, వైద్యసేవలు అందించడం వంటి చర్యలు సంక్షేమ పరిపాలనకు నిదర్శనమయ్యాయి. దక్షిణ భారతదేశంలో శాతవాహనులు, తరువాత గుప్తులు, చోళులు, పల్లవులు, కాకతీయులు వంటి రాజవంశాలు వ్యవసాయం, వాణిజ్యం, కళలు, విద్య, నీటి నిర్వహణలో విశేష కృషి చేశాయి. గుప్తుల కాలం భారత స్వర్ణయుగంగా పేరుపొందింది. ఆర్యభట్టుడు, బ్రహ్మగుప్తుడు, సుశ్రుతుడు, చరకుడు, కాళిదాసు వంటి మహనీయులు విజ్ఞాన, సాహిత్య రంగాలను విశ్వస్థాయికి చేర్చారు. గ్రామ స్వయంపాలన, దేవాలయ కేంద్రిత ఆర్థిక వ్యవస్థ, చెరువుల నిర్మాణం భారత సమాజాన్ని బలోపేతం చేశాయి. మధ్యయుగంలో ఢిల్లీ సుల్తానులు, మొఘలులు భారతీయ పరిపాలన, కళలు, వాస్తుశిల్పం, సంగీతంపై కొత్త ప్రభావాలను చూపారు. కాకతీయులు తెలంగాణలో చెరువుల నిర్మాణం, సాగునీటి అభివృద్ధి ద్వారా ప్రజా సంక్షేమానికి విశేష సేవలందించారు. భక్తి, సూఫీ ఉద్యమాలు మానవత, సహనం, సామరస్యాన్ని ప్రోత్సహించాయి. అక్బర్ వంటి పాలకులు మతసహనంతో కూడిన పరిపాలనకు ఆదర్శంగా నిలిచారు. తాజ్ మహల్, ఫతేపూర్ సిక్రీ, ఎర్రకోట వంటి నిర్మాణాలు భారతీయ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటాయి. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం కీలక స్థానాన్ని ఆక్రమించింది. వస్త్రాలు, మసాలా దినుసులు, లోహకళలు, వజ్రాలు, చేనేత ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లలో విశేష ఆదరణ పొందాయి. అయితే సముద్ర మార్గం ఆవిష్కరణ అనంతరం ఐరోపా దేశాలు వాణిజ్య సంస్థల పేరుతో భారతదేశంలో స్థిరపడి, క్రమంగా రాజకీయ ఆధిపత్యాన్ని సాధించాయి. 1757 ప్లాసీ, 1764 బక్సర్ యుద్ధాల తరువాత బ్రిటిష్ పాలన భారతదేశాన్ని తీవ్ర ఆర్థిక దోపిడీకి గురి చేసింది. జమీందారీ వ్యవస్థ, అధిక పన్నులు, చేనేత పరిశ్రమ పతనం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. ఒకప్పుడు ప్రపంచ స్థూల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న భారతదేశం వలస పాలనలో తీవ్రంగా వెనుకబడింది. అయినప్పటికీ ఇదే కాలంలో రాజారామమోహన్ రాయ్, విద్యాసాగర్, జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, వివేకానంద, కందుకూరి వీరేశలింగం వంటి సంస్కర్తలు విద్య, మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం ఉద్యమాలు చేపట్టారు. 1857 స్వాతంత్ర్య సమరం జాతీయ చైతన్యానికి నాంది పలికింది. అనంతరం మహాత్మా గాంధీ నాయకత్వంలో సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, భారత్ విడిచి పో ఉద్యమం వంటి పోరాటాలు స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాయి. భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తదితరులు స్వాతంత్ర్య పోరాటానికి విశేష సేవలందించారు.

1947లో స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ప్రజాస్వామ్యాన్ని ఎంచుకుంది. 1950లో రాజ్యాంగం అమల్లోకి రావడంతో సమాన హక్కులు, సామాజిక న్యాయం, మత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిపాలనకు బలమైన పునాదులు ఏర్పడ్డాయి. హరిత విప్లవం, శ్వేత విప్లవం, అంతరిక్ష పరిశోధనలు, సమాచార సాంకేతిక రంగం, ఔషధ పరిశ్రమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి దేశాన్ని కొత్త దిశలో నడిపించాయి. అయితే అభివృద్ధితో పాటు వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, పర్యావరణ కాలుష్యం, నీటి కొరత, వాతావరణ మార్పులు, సామాజిక అసమానతలు వంటి సవాళ్లు కూడా కొనసాగుతున్నాయి. సాంకేతిక పురోగతితో పాటు కుటుంబ విలువలు, ప్రకృతితో అనుబంధం, సామాజిక బాధ్యతలను కాపాడుకోవడం కూడా అత్యంత అవసరం. తరతరాల భారత జీవన నేపథ్యాన్ని పరిశీలిస్తే ఒక గొప్ప సత్యం స్పష్టమవుతుంది.

సామ్రాజ్యాలు మారాయి, రాజకీయ వ్యవస్థలు మారాయి, విదేశీ ప్రభావాలు వచ్చాయి. కానీ భారతీయ నాగరికత తన మూల సారాన్ని కోల్పోలేదు. కుటుంబ వ్యవస్థ, వ్యవసాయ సంస్కృతి, జ్ఞాన సంపద, ప్రకృతి పట్ల గౌరవం, సహనం, సమన్వయం, మానవతా విలువలే భారతదేశాన్ని యుగయుగాలుగా నిలబెట్టాయి. అందువల్ల భారత చరిత్రను కేవలం పాలకుల చరిత్రగా చూడలేం. అది రైతు చెమటతో పెరిగిన నాగరికత చరిత్ర; శాస్త్రవేత్తల విజ్ఞాన గాథ; కవుల సాహిత్య సంపద; కళాకారుల సృజన; సంస్కర్తల సంస్కరణ; స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం; ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన కోట్లాది భారతీయుల జీవన చరిత్ర. ఈ మహత్తర వారసత్వాన్ని శాస్త్రీయ దృక్పథంతో, సామాజిక న్యాయంతో, ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ భావితరాలకు మరింత సమృద్ధిగా అందించడం మనందరి చారిత్రక బాధ్యత.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.